TGTEL/25/A3750

... నిజమే ...

# నిజాయితీ

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య సంపుటి 1 సంచిక 19 ప్రింటర్ : గుండూర్ శ్యామ్ . గురువారం 04 డిసెంబర్ 2025 వెల 4:00


"నిజాయితీ" ఒక ముఖ్యమైన నైతిక లక్షణం ఇది విశ్వసనీయత, విధేయత మరియు సమగ్రతను పెంచుతుంది.



# ఢిల్లీలో రేవంత్ బిజీబిజీ

## ఒకే రోజులో ప్రధాని మోదీ, రాహుల్, ప్రియాంకతో సమావేశం!

**న్యూఢిల్లీ, డిసెంబర్ 03 (నిజాయితీ) :**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని నేడు(డిసెంబర్ 3) ఢిల్లీలో పలువురు కాంగ్రెస్ అగ్రనేతలు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ప్రత్యేకం భేటీ అయ్యారు.ప్రధాని మోదీతో భేటీ.. 'తెలంగాణ రైజింగ్ 2047'కి ఆహ్వానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పార్లమెంట్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌కు రావాల్సిందిగా ప్రధాని మోదీని సీఎం ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన సమ్మిట్ ఆహ్వాన పత్రికను ఆయన ప్రధానికి అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఎంచుకున్న వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతుందని సీఎం ప్రధానికి వివరించారు.నీతి ఆయోగ్ సలహాలు, సూచనలతో పాటు అన్ని రంగాల నిపుణుల మేధో మథనంతో తయారు చేసిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఈ గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించనున్నట్లు సీఎం





ప్రధానికి వివరించారు. ఈ భేటీలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఉన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో సమావేశం అంతకుముందు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర ఎంపీలు, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో భేటీ అయ్యారు.హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాల్సిందిగా వారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధి, ఆదాయ వృద్ధి లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ గురించి సీఎం ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలకు వివరించి, ఆహ్వాన పత్రికను అందించారు.

# జర్నలిస్టుల మహా ధర్నా



**హైదరాబాద్, సెప్టెంబర్ 03 (నిజాయితీ) :** తెలంగాణలోని జర్నలిస్టులు తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు, డిసెంబర్ 3న హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచార భవన్ (ఐ అండ్ పిఆర్) ఎదుట 'మహా ధర్నా' నిర్వహించారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజెయు) ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది.

జర్నలిస్ట సమస్యలు పరిష్కారం చేయాలనే ప్రధాన డిమాండ్ తో టీయూడబ్ల్యూజె ఆధ్వర్యంలో సమాచార శాఖ ప్రధాన కార్యాలయం వద్ద జర్నలిస్టు మహా ధర్నా నిర్వహించారు. అధ్యక్షులు విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమం లో తెలంగాణ వ్యాప్తంగా జర్నలిస్టు హాజరు కాగా యూనియన్ నాయకులు దేవులపల్లి అమర్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డిలు పాల్గొని సంఘీభావం తెలిపారు. ధర్నా అనంతరం జర్నలిస్ట్ సంఘం నాయకులు సమాచార శాఖ ఏడిజగన్కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అక్రిడేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య భీమా పతకాన్ని వెంటనే పునరిద్దరించాలని, అర్హులైన జర్నలిస్ట్ లకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలనీ, సంక్షోబంలో ఉన్న చిన్న, మధ్య తరగతి పత్రికలను ఆదుకోవాలనే ప్రధాన డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

**ప్రధాన డిమాండ్లు**

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న 12 సంవత్సరాల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ, ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని యూనియన్ నేతలు కోరారు. వారి ప్రధాన **డిమాండ్లు:** అక్రిడిటేషన్ కార్డులు: కొత్త అక్రిడిటేషన్ పాలసీని ప్రకటించి, అర్హులైన జర్నలిస్టులకు తక్షణమే కొత్త కార్డులు జారీ చేయాలి.

ఆరోగ్య బీమా: జర్నలిస్టుల ఆరోగ్య బీమా పథకాన్ని పునరుద్ధరించాలి.

గృహ స్థలాలు: అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలను కేటాయించాలి.

**కమిటీల ఏర్పాటు:** వృత్తిపరమైన కమిటీలను ఏర్పాటు చేయాలి.

చిన్న, మధ్య తరహా పత్రికలకు మద్దతు: మనుగడ కోసం పోరాడుతున్న చిన్న మరియు మధ్య తరహా వార్తాపత్రికలకు ప్రభుత్వ మద్దతు అందించాలి.

రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోందని ఆరోపిస్తూ, ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని టీయూడబ్ల్యూజె నేతలు హెచ్చరించారు. పలు జిల్లాల నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున ఈ ధర్నాలో పాల్గొన్నారు.

# తెలంగాణ నిరుద్యోగులకు తీపికబురు

## త్వరలో 40 వేల ఉద్యోగాలు రేవంత్ రెడ్డి కీలక ప్రకటన

**హుస్నాబాద్, డిసంబర్ 03 (నిజాయితీ) :** నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. త్వరలో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కాగా, తాము అధికారంలోకి వచ్చాక 61,379 ఉద్యోగాలు భర్తీ చేశామని.. రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగాల కల్పన లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. కాగా, తమ ప్రభుత్వం విద్య, నీటిపారుదల రంగాలపై దృష్టి సారించిందని చెప్పారు. ఈ మేరకు హుస్నాబాద్‌లో జరిగిన ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు.

తెలంగాణలో నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

త్వరలో 40 వేల ఉద్యోగాలు

సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన


నిరుద్యోగులకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక యువత ఆకాంక్షలను గుర్తించి 61,379 ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. ఈ క్రమంలోనే మరో 40 వేల ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు కీలక ప్రకటన చేశారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలన పూర్తయ్యేసరికి లక్ష ఉద్యోగాల మార్క్‌ను అందుకుంటామని చెప్పారు. విద్య, నీటిపారుదలపై కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టిందన్నారు. ఈ మేరకు ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం (డిసెంబర్ 3న) సిద్దిపేట జిల్లా హుస్నాబాద్?లో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. బహుజన సామ్రాజ్యం కోసం సర్దార్ సర్వాయి పాపన్న పునాదులు వేశారన్న సీఎం.. 2001లో హుస్నాబాద్ ప్రాంతం నుంచే తెలంగాణ ఉద్యమం మొదలైందని



గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తామని 2004న కరీంనగర్ గడ్డపై ఇచ్చిన మాటను.. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ నిలబెట్టుకున్నారన్నారు. దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ స్ఫూర్తితోనే తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. హుస్నాబాద్ అంటే తనకు సెంటిమెంట్ అని మాజీ సీఎం కేసీఆర్ చెబుతారని.. కానీ బీఆర్ఎస్ పాలనలో హుస్నాబాద్ నిర్లక్ష్యం చేశారన్నారు. ఈ ప్రాంతంలోని కుండపల్లి, గౌరెల్లి రిజర్వాయర్లు పూర్తి చేసే బాధ్యత తనదే అని సీఎం రేవంత్ చెప్పారు.

**70,011 ఉద్యోగాలు భర్తీ..**

తాము అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రాష్ట్రంలో 61,379 ఉద్యోగాలు భర్తీ చేశామని కాంగ్రెస్ చెబుతోంది. మరో 8632 పోస్టుల నియామకాలు తుది దశలో ఉన్నాయని తెలిపింది. వీటితో కలిపితే మొత్తం ఉద్యోగ నియామకాల సంఖ్య 70,011 చేరుతుందని.. త్వరలోనే లక్ష ఉద్యోగాల మార్క్‌ను అందుకునే దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వెల్లడించింది.ప్రభుత్వం వివరాల ప్రకారం.. రెండేళ్లలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 15,780 ఉద్యోగాలు భర్తీ చేశారు. తెలంగాణ స్టేట్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా 16,067 ఉద్యోగాలు, మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్మెంట్ బోర్డులో 8,666 పోస్టులు, తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ రిక్రూట్మెంట్ బోర్డులో 8,400 ఉద్యోగాలు భర్తీ చేశారు. ఇక డీఎస్సీ ద్వారా 10,006 నియామకాలు చేపట్టారు. విద్యుత్ రంగంలో టీజీజెన్‌కో , టీజీఎన్‌పీడీసీఎల్‌లో 1,105 ఉద్యోగాలు భర్తీ చేశారు. ఇక సింగరేణి, ఇతర సంస్థలు కలిపి 1,355 ఖాళీలను పూర్తి చేశారు. మొత్తంగా ఇప్పటివరకు 61,379 పోస్టులను భర్తీ చేసింది తెలంగాణ ప్రభుత్వం.ఇక వైద్య రంగంలో 7,267 ఉద్యోగాలు, నియామక ప్రక్రియ కొనసాగుతోంది. 1,365 గ్రూప్ 3 పోస్టులకు ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోంది. అంటే ఈ నియామకాలు పూర్తైతే మొత్తం సంఖ్య 70,011కు చేరుతుంది.

TGTEL/25/A3750 ... నిజమే ... నిజాయితి
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక



# ప్రపంచ వికలాంగుల దినోత్సవం

**- గద్వాల జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ**

**గద్వాల, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** జిల్లా వికలాంగుల సేవా సంఘం అధ్యక్షుడు చంటిబాబు ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వివిధ మండలాల నుండి వికలాంగుల సోదరీ సోదరా మ ణులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే పాత బస్టాండు,గాంధీ చౌక్, రాజీవ్ మార్క్,కొత్త బస్టాండు, కృష్ణవేణి చౌ, మీదుగా ర్యాలీ నిర్వహించారు. మరియు ప్రపంచ వికలాంగుల దినోత్సవం సంద ర్భంగా అధ్యక్షుడు చంటి బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు వికలాంగుల పట్ల చట్టసభలో అన్ని అవకాశాలు కల్పించాలని ఆయన అన్నారు. విద్యా, వైద్యం, నిరు ద్యోగిత,



జీవనోపాధి, ప్రభుత్వ పథకాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం రిజర్వేషన్, కల్పించాలని ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేడు ప్రపంచంలో 193 దేశాలు వికలాంగుల దినోత్సవం డిసెంబర్ 3 ను ప్రతి దేశం కూడా జరుపుకుం టున్నారని ఆయన తెలియపరి చారు వికలాంగులు అనేవారు సమాజంలో తక్కువ ఏం కాదని, అలాగే సకలాంగులతో, వికలాంగు లు ఛాలెంజ్ చేస్తూ.. అన్ని రంగాల లో.. వికలాంగులు రాణిస్తున్నారు అని గుర్తు చేశారు. అలాగే వికలాం గులు అనేవారు సమాజంలో ఆత్మవిశ్వాసంతో, పట్టుదల, శక్తి సామర్థ్యాలతో, సొంతంగా తమ పనులు చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో వివిధ మండలాల వికలాంగుల సోదరి సోదరా మనులు అందరూ పాల్గొని ఈ ర్యాలీని విజయవంతం చేశారు.

# బి.ఆర్.ఎస్ పార్టీ బలపరిచిన నలుగురు సర్పంచులు ఏకగ్రీవం

**వనపర్తి, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** గత అభివృద్ధినీ ఆదరించిన ప్రజలకు అండగా నిలబడతామని, ప్రతిపక్ష పార్టీగా నాలుగు సర్పంచు స్థానాలు సాధించడం ప్రజల ఆశీర్వాదం. ఇది శుభ పరిణామం అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మొదటి దశ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున మేము బలపరిచిన అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు అని మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు అన్నారు. మా పార్టీకి అండగా నిలిచిన ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఓటమి గెలుపులతో సంబంధం లేకుండా ప్రజల మధ్య ఉంటూ నిరంతరం ప్రజల సమస్యల పట్ల స్పందించామని ప్రజలు బి.ఆర్.ఎస్ పార్టీయే మాకు అండ అని నమ్మి నలుగురు సర్పంచులను ఏకగ్రీవం చేశారని ఇదే ఉత్సాహముతో పార్టీ శ్రేణులు కష్టపడి పని చేసి



ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి మరియు గత ప్రభుత్వ పథకాలను ప్రజలకు గుర్తు చేసి ప్రజల అభిమానాన్ని సంపాదించి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ దుందుభి మోగించాలని పిలుపునిచ్చారు. మొదటి దశలో బీఆర్ఎస్ పార్టీకి ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్లు: 1.కొడవత్ శాంతి (భర్త: కొడవత్ కృష? నాయక్) గ్రామం: కర్నె తండా, మండలం: ఘన్పూర్ రెండోసారి ఏకగ్రీవ విజయం, 2.కేతావత్ చంద్రమ్మ (భర్త: ముదావత్ పందు) గ్రామం: కోతులకుంట తండా, మండలం: ఘన్పూర్, 3.ముదావత్ కవిత (భర్త: ముదావత్ శంకర్) గ్రామం: అముదాలకుంట తండా, మండలం: గోపాలపేట, 4.బంగారయ్య గ్రామం: లక్ష్మీదేవిపల్లి, మండలం: గోపాలపేట గ్రామీణా భివృద్ధికి బీఆర్ఎస్ పాలనలో అందించిన సంక్షేమ పథకాలను గుర్తుచేసుకుని మా అభ్య ర్థులను ఏకగ్రీవం గా ఎన్ను కున్న ప్రజల విశ్వాసానికి కట్టుబడి పనిచేస్తాం అని మరొక్కసారి ఏకగ్రీవం చేసిన గ్రామాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు**

**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** ఈనెల 7 8 9 తేదీలలో మెదక్ పట్టణంలో జరుగుతున్న సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ ఎదురుగా సిఐటియు రాష్ట్ర మహాసభల పోస్టర్లను కార్మికులతో కలిసి ఆవిష్కరించడం జరిగింది. ఈ యొక్క మహాసభల కు సభ అధ్యక్షులు కామ్రేడ్ చుక్క రాములు ముఖ్య అతిథులు కామ్రేడ్ బి వి రాఘవులు ఉమ్మడి రాష్ట్ర సిఐటియు పూర్వ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కే హేమలత సిఐటియు అఖిలభారత అధ్యక్షులు వక్తలు కామ్రేడ్ సాయిబాబు సిఐటియు అఖిలభారత కోశాధికారి కామ్రేడ్ పాలడుగు భాస్కర్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎస్ వీరయ్య తదితరులు ముఖ్య వక్తలుగా పాల్గొంటున్నారుఈ సందరరేగా ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన నాలుగు నల్ల చట్టాలను తీసుకొచ్చి కార్మిక వ్యవస్థను విచ్చిన్నం చేసిందని ఆయన అన్నారు కేంద్రంలో నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ ను బ్రిటిష్ కాలంలో కార్మికులు పోరాడి సాధించుకున్న




హక్కులను రద్దు చేస్తూ కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే విధంగా ఈ చట్టాలను తెచ్చారు ఈ చట్టాలు అమలు జరిపి కార్మికులను బానిసలుగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం దేశంలో ఈ నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చారని వీటిని వెంటనే రద్దు చేయాలి కార్మికులకు కనీస వేతనం 26,000 చెల్లించాలి ఉద్యోగ భద్రత కల్పించాలి అందులో భాగంగా పని గంటల పెంపు రోజువారి కనీస వేతనాన్ని 175 రూపాయలుగా నిర?యించడం కార్మికుల యొక్క హక్కులు కాలరాయడమేనని ఆయన అన్నారు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానాలు ఖండిస్తూ భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడం కోసం ఈ యొక్క మహాసభలు వేదిక కానున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రామస్వామి శ్రీను మోహన్ పరశురాములు రాములు మసన్న రాము బాలయ్య మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం.

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** జాతీయ పొల్యూషన్ కంట్రోల్ డే పురస్కరించుకొని, తెలంగాణ నేషనల్ గ్రీన్ కాప్స్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ఎకో క్లబ్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందరరేగా కాలుష్య నివారణపై డిగ్రీ విద్యార్థులు, నాగనుల్ కేజీబీవీ ఇంటర్ విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని, టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ పర్యావరణంపై ఒత్తిడి కూడా పెరుగుతోందని అన్నారు. ఈ వేగాన్ని నియంత్రించే దిశగా యువత ముందుకుసాగాల్సిన అవసరాన్ని ఆయన ప్రత్యేకంగా చెప్పారు. కాలుష్య రకాలు, వాటి ఆరోగ్య ప్రభావాలు, భవిష్యత్తులో వాటి వల్ల వచ్చే ప్రమాదాలపై ఆయన విద్యార్థులకు విశదీకరించారు. కార్యక్రమంలో ఎకో క్లబ్ సభ్యులు తయారు





చేసిన అవగాహన కార్డులు, పర్యావరణ రక్షణపై రూపొందించిన పోస్టర్లను ప్రదర్శించారు. విద్యార్థులు స్వఛతే, చెట్లు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి సంరక్షణ వంటి చర్యలపై ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ పరిరక్షణలో చిన్న చిన్న చర్యలు కూడా పెద్ద మార్పుకు దారితీస్తాయని ఈ సందరరేగా నిర్వాహకులు చాటి చెప్పారు. అలాగే, కాలుష్య నియంత్రణలో సమాజంలోని ప్రతి వర్గం బాధ్యత వహించాలని, వ్యక్తిగత స్థాయిలో ప్రారంభమయ్యే మార్పు పర్యావరణానికి కవచంలా నిలుస్తుందని ప్రిన్సిపాల్ మదన్ మోహన్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వం లేదా సంస్థల పని కాదని, ప్రతి పౌరుడి భాగస్వామ్యం కీలకం అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థులు, అధ్యాపకులు కోదండరాములు, రామకృష?, దశరథం, ఎకో క్లబ్ సభ్యులు మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నం నారాయణ కుటుంబం సేవాభావం

**- అయ్యప్ప స్వాములకి ఆర్థిక సహాయం అందజేత**

**మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** జడ్చర్ల మున్సిపాలిటీ తాలుకా క్లబ్ రోడ్డులోని మహేష్ కిరాణం ఎన్నం నారాయణ గుప్తా జ్ఞాపకార్థంగా బుధవారం చంద్ర గార్డెన్‌లో అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమంలో ప్రతి ఏటా శబరిమలైకి వెళ్లే అయ్యప్పలకు దారి ఖర్చుల నిమిత్తం అందజేస్తున్న ఆర్థిక సహాయాన్ని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి అందజేశారు.కన్నె స్వాములు విజయ్ కుమార్, సురేష్ లకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున, మణికంఠ స్వాములు ప్రగ్నిక, రవి లకు ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున సహాయాన్ని ఎన్నం నారాయణ ధర్మపత్ని నర్సమ్మ, కుమారులు మోహన్ బాబు, మహేష్ కుమార్, రాఘవేందర్, కొడళ్లు లావణ్య, కళ్యాణి, తులసి, సన్నిధానం గురుస్వామి జగదీశ్వర్ రెడ్డి చేతుల మీదుగా పూలమాలలు, శాలువాలతో సత్కరించి అందజేశారు.అయ్యప్ప భక్తి, సేవాభావానికి ఎన్నం నారాయణ కుటుంబం



నిలువుటద్దమని హాజరైన భక్తులు కొనియాడారు. కార్యక్రమంలో రవిశంకర్ బాద్మీ, తోటారెడ్డి గురుస్వామి, రంజిత్ బాబు స్వామి, రఘు స్వామి, దేవా స్వామి, పర్వత రెడ్డి స్వామి, అనిల్ రెడ్డి స్వామి, ధృవ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకాంతాచారి వర్ధంతి



**అచ్చంపేట, డిసెంబర్ 03 (నిజాయితి) :** తెలంగాణ మలి దశ ఉద్యమ వీరుడు కాసోజు శ్రీకాంతాచారి 16వ వర్ధంతి సందర్భంగా అచ్చంపేట పట్టణ విశ్వ బ్రాహ్మణులు మరియు తదితర రాజకీయ పార్టీల నాయకులు అచ్చంపేట పట్టణంలోని బస్టాండ్ ముందర తెలంగాణ అమరవీరుల స్థూపం దగ్గర ఘనంగా జరుపుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ తెలంగాణ స్థాపనలో తన ప్రాణాలను లెక్కచేయకుండా ఆత్మహత్యతోనైనా తెలంగాణ సాధిస్తూ అనుకొని ప్రాణ త్యాగం చేశారు అయినా కానీ గత ప్రభుత్వం శ్రీకాంత్ ఆచారి కుటుంబానికి గౌరవించలేదని శ్రీకాంతాచారి మాతృమూర్తి శంకరమ్మకు ఏదైనా నామినేటెడ్ పదవి ఇచ్చి వారి కుటుంబాన్ని గౌరవించాలని ఆర్థికంగా ఆదుకోవాలని కోరడం జరిగింది ప్రస్తుత గౌరవ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి కాంగ్రెస్ ప్రభుత్వం శంకరమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం నాయకులు కందుకూరి నాగరాజు మిడ్జిల్లా మాధవాచారి కపిలవాయి ఉమాశంకర్ డాక్టర్ విష్ణుమూర్తి కాకునూరు శ్రీనివాసచారి రేసోజు మురళి ఉప్పునుంతల శ్రీనివాస్ ఆచారి కాసోజు వీరాచారి దేవ పూజ వినోద్ చేపూరి జంగా చారి శేఖర్ చింతోజు శ్రీనివాసులు కొండూరు శేఖర్ గారు గారు ఉద్యమ నాయకులు మహబూబ్ అలీ రమాకాంత్ గారు నాయకులు పాల్గొని తెలంగాణ అమరుని త్యాగాలను గుర్తుచేసుకొని పుష్పాంజలి ఘటించారు

# బీసీ సమాజ్ చాయ్ పే చర్చ




**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీ లో విద్యార్థులు, బీసీ కులసంఘ నాయకులతో కలిసి " చాయ్ పే చర్చ " కార్యక్రమం బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ నిర్వహించడం జరిగింది.బీసీలకు న్యాయంగా దక్కవలసిన రిజర్వేషన్ల గురించి ఈడబ్ల్యూఎస్ పేరుతో బీసీ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయం గురించి మాట్లాడుకోవడం జరిగింది..ఈ కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు తాయప్ప, జేఏసీ నాయకుడు సారంగి లక్ష్మి కాంత్, జాంగ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, నాయి బ్రాహ్మణ సంఘ పట్టణ అధ్యక్షుడు అశ్విని సత్యం, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు చిట్లపల్లి దుర్గేష్ పాలమూరు యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వాములకు 50 కేజీల బియ్యం అందజేత

**- బిఆర్‌కె న్యూస్ రిపోర్టర్ రామాంజనేయులు**



**గద్వాల, డిసెంబర్ 03 (నిజాయితి) :** గద్వాల పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీ లో కొలువైన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప మాల ధారణ లో ఉన్న స్వాములకు అన్నదానం నిర్వహించే కార్యక్రమం కు నా వంతుగా సహాయంగా బిఆర్‌కె న్యూస్ రిపోర్టర్ రామాంజనేయులు 50 కేజీల బియ్యం ప్యాకెట్టును నరేంద్ర స్వామి ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ అయ్యప్ప స్వామి ఆశీస్సులు మీకు మీ కుటుంబ సభ్యులందరి పై స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని నరేంద్ర స్వామి ఆశీర్వాదంతో కూడిన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎన్‌పిఆర్‌డి ఇండియా ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు

**అచ్చంపేట, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** బుధవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా అచ్చంపేట నియోజకవర్గం ఎన్‌పిఆర్‌డి ఇండియా వికలాంగుల సంఘం కార్యాలయం అచ్చంపేటలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి,




ఆర్‌డిటి సంస్థ అచ్చంపేట ఏరియా టీమ్ లీడర్ రామ్మోహన్ హాజరయ్యారు, ఈ కార్యక్రమంలో. జిల్లా అధ్యక్షుడు ఆంగోత్ శంకర్, అచ్చంపేట టౌన్ అధ్యక్షులు గణేష్ కుమార్, శంకర్, మహేష్. విజయ్ కుమార్. రామస్వామి, లలిత, లక్ష్మణ్,ఆర్డిటి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

TGTEL/25/A3750
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

# డిఎన్ఆర్ ఉదారత్వం ప్రతి బాధిత కుటుంబానికి ఆర్థిక సహకారం

**ఊర్కొండ, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇటీవలి కాలంలో మృతి చెందిన ఊర్కొండ మండలంలోని బాధిత కుటుంబాలకు ఆర్థిక సహకారం అందజేసితమ ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. ఊర్కొండపేట గ్రామానికి చెందిన మృతురాలు మస్న రాములమ్మ, మాధారం గ్రామానికి చెందిన మృతుడు జంగాల రామలింగం, మాధారం గ్రామానికి చెందిన మృతుడు జంగాల శ్రీను కుటుంబాల కుటుంబాలను పరామర్శించిన మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెం ట్ ద్యాప నిఖిల్ రెడ్డి (డిఎన్ఆర్) మండల కాంగ్రెస్ నాయకుల ద్వారా ప్రతి బాధిత కుటుంబానికరి రూ.5000/- చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు తీర్మని రవీందర్ గౌడ్, ఆలయం డైరెక్టర్ మొండేళ్ల రమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చాంద్ పాషా, మొండేళ్ల అశోక్, నాయకులు మనోహర్ రెడ్డి, డా.రాజేష్, అమీర్, తాళ్ల శేఖర్, రవీందర్ సాగర్, కాటమోని జంగయ్య, మన్సూర్, షాకేర్ తదితరులు ఉన్నారు. డిఎన్ఆర్ యువసేన సభ్యులు తదితరులు ఉన్నారు.



# కాంగ్రెస్ గూటికి పాలెం

**- సీఎం సమక్షంలో చేరిన పిఎసిఎస్ చైర్మన్ల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం సుదర్శన్ గౌడ్**

**మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** ఉమ్మడి పాలమూరు జిల్లా పిఎసిఎస్ చైర్మన్ల ఫోరం ప్రధాన కార్యదర్శి, జడ్చర్ల పిఎసిఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుదర్శన్ గౌడ్ కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చేపడుతున్న వివిధ అభివ ృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితుడై నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివ ృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయినట్లు పాలెం సుదర్శన్ గౌడ్ తెలిపారు. సుదర్శన్ గౌడ్ తో పాటు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి జగన్ గౌడ్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో బురెడ్డిపల్లి మాజీ సర్పంచ్ గుండు వెంకటేష్ తదితరులు ఉన్నారు.కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకై క ృషి :కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలందరు క ృషి చేయాలని ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్ పిలుపునిచ్చారు.



# మద్దిమడుగు అంజనేయ స్వామిని దర్శించుకున్న

**- మాజీ ఎమ్మెల్యే డా.గువ్వల బాలరాజు**



**పదర, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నల్లమల ప్రాంతం పదర మండల పరిధిలోని మద్దిమడుగు క్షేత్ర పబ్బతి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా బుధవారం శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి వారిని అచ్చంపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గువ్వల బాలరాజు బీజేపీ నాయకులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి,స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రవి ముదిరాజు, ఆనంద్, రామోజీ, గోలి శ్రీను, శంకర్ మాదిగ, మహేందర్, రవి, అంజి, సోషల్ మీడియా ఇంచార్జ్ చౌట శివ తదితరులు పాల్గొన్నారు.

# రౌడి షీటర్ల కదలికలపై దృష్టి పెట్టాలి

**- జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్**

**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్. బుధవారం సాయంత్రం కొల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి, కొల్లాపూర్, కోడేరు పోలీస్ స్టేషన్స్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్స్ పరిధిలో ఉన్న గ్రామాలలో ఎన్నికల సరళి ఏ విధంగా ఉంది, నామినేషన్ క్లస్టర్ల వద్ద బందోబస్తు ఏర్పాట్లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఎన్ని ఉన్నాయో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అదేవిధంగా రౌడీ షీటర్ల వివరాలను తెలుసుకుని, వారి కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.గ్రామ స్థాయిలో పనిచేస్తున్న విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ తమ తమ గ్రామాల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు క ృషి చేయాలని తెలిపారు. నేర నిరోధక చర్యల్లో భాగంగా ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చురుకుగా ముందుకు రావాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ల సందర్శన సమయంలో స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ పట్ల సంత ృప్తి వ్యక్తం చేసిన జిల్లా ఎస్పీ.



ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ వ్యవస్థ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

# పల్లె గడ్డ సర్పంచ్ ఏకగ్రీవం

**- పోమాల బాలరాజును వరించిన పదవి**

**మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** మహబూబ్ నగర్ జిల్లా నవాబుపేట మండలంలోని పల్లెగడ్డ గ్రామ సర్పంచ్ పదవి ఏకగ్రీవం అయింది. బుధవారం నాటి ఉపసంహరణ కార్యక్రమంలో సమీప పోటీ అభ్యర్థి తన నామినేషన్ ఉపసంహరించు కోవడంతో టిఆర్ఎస్ పార్టీ నాయకులు పోమాల బాలరాజ్‌ను సర్పంచ్ పదవి వరించింది. బాలరాజుకు పోటీగా గ్రామానికి చెందిన మరో అభ్యర్థి వడ్డే అంజయ్య నామినేషన్ దాఖలు చేశారు. ఉపసంహరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం నామినేషన్ వెనక్కు తీసుకోవడంతోసర్పంచిపదవిటిఆర్ఎస్ ఖాతాలో పడింది.



# తెలంగాణ మలిదశ తొలి అమరవీరుడు శ్రీకాంత్ చారి

**- విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారికి ఘన నివాళులు.**

**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** తెలంగాణ మలిదశ తొలి అమరవీరుడు శ్రీకాంతా చారి అని, తెలంగాణ నవ నిర్మాణంలో అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాగర్ కర్నూల్ పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు అన్నారు, బుధవారం తెలంగాణ మలిదశ ఉద్యమం తొలి అమరుడు శ్రీకాంతాచారి 16వ వర్ధంతిని పురస్కరించుకొని అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా శ్రీకాంతాచారి చూపిన చొరవ ఉద్యమ స్ఫూర్తి పలువురికి స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జరుగుతున్న అడ్డంకులను ఉద్యమకారుడిగా గుర్తించిన శ్రీకాంత్ ఆచారి ఉద్యమంలో చురుకుగా పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధనకు బలిదానం చేసి అమరుడు అయ్యారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో శ్రీకాంతాచారి చిరస్థాయిగా నిలిచిపోతాడన్నారు.రాష్ట్ర సాధనలో శ్రీకాంత్ చారి త్యాగం తెలంగాణ పోరాటానికి దిశా నిర్దేశంగా మారి ఎందరో ఉద్యమకారులను ముందుకు తీసుకువెళ్లే విధంగా బాట పడిందన్నారు. శ్రీకాంతాచారిని స్ఫూర్తిగా తీసుకొని యువత ఉద్యమంలో భాగస్వాములు కావడం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ప్రతాప్ చారి,పాండు చారి, జెపి చారి, మన్యం చారి, అరవింద్ చారి, కేశవా చారి, ప్రసాద్ చారి, కపిలవాయి రాజు, సుగుణా చారి, వీర సత్యం చారి, కపిలవాయి గోపి చారి ,శ్రీను చారి, వేణు చారి,నరేందర్ చారి, రాజు చారి, విషు? చారి పాల్గొన్నారు.



# ఈనెల 10న ఉచిత కంటి చికిత్స శిబిరం

**నాగర్‌కర్నూల్ బ్యూరో, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** నాగర్‌కర్నూల్‌జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యం లో జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీ, రామక ృష? టాకీస్ రోడ్డు లో గల శోభ ఆప్టికల్ లో ఈ నెల 10న బుధవారం నాడు ఉదయం 9గంటలకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఆప్తాలమిక్ ఆఫీసర్ బి.శివారెడ్డి తెలిపారు.ఈ శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి, క్యాటరాక్ట్ పోరగల వారినీ ప్రత్యేక అంబులెన్స్ ద్వారా లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రి,ఎనుగొండ, మహబూబ్ నగర్ కి పంపించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనునట్లు తెలిపారు. రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా రక్తపరీక్షలు, సాధారణ పరీక్షలు, ప్రతిరోజు నిర్వహిస్తారని తెలిపారు.శిబిరానికి వచ్చే ముందు ఆధార్ కార్డు, ఓటర్ కార్డ్,లేదా రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని సూచించారు.మరిన్ని వివరాలకు **9440454284, 8106333324** నెంబర్ లలో సంప్రదించాలని కోరారు



# నవజాత శిశువుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి

**- ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**


**మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** నవజాత శిశువుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక ద ృష్టి సారించినట్లు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మహబూబ్ నగర్ నియోజకవర్గానికి చెందిన నవజాత శిశువుల తల్లులకు యెన్నం హెల్త్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన ప్రతి తల్లికి ఈ యెన్నం హెల్త్ కిట్ పంపిణీ చేయడం జరుగుతుందని,ఇది పూర్తిగా నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. నవజాత శిశువుల ఆరోగ్యమే లక్ష్యంగా ఈ హెల్త్ కిట్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. "నవజాత శిశువు ఆరోగ్యం కుటుంబ ఆరోగ్యానికి పునాది అని, శిశువు పొందే ప్రాథమిక సంరక్షణ, పోషకాహారం, శుభ్రత వంటి అంశాల్లో అలస్యముండకూడదని. అందుకే ఈ హెల్త్ కిట్‌ను ప్రసవానంతరం వెంటనే అందించడం ద్వారా ఉపయోగకరమైన సహాయం అందించాలనుకుంటున్నాం" అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సేవల మెరుగుదలకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కూడా ఆయన ఈ సందర్భంగా వివరించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోజువారీగా పెరుగుతున్న ప్రసవాల సంఖ్య ద ృష్ట్యా సిబ్బంది, వైద్య వనరుల ను మరింతగా బలోపేతం చేయడానికి చర్యలు కొనసాగుతున్నా యని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ రంగ అజ్మీర మాట్లాడుతూ, ప్రసవానంతర దశలో తల్లి%--%శిశు ఆరోగ్యం అత్యంత కీలకమని, ఈ కిట్లు ప్రాథమిక సంరక్షణలో తక్షణ సహాయాన్ని అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేంద్ర, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



# రాంరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ ఏకగ్రీవ ఎన్నిక

**- ఆనంద సంబరాల్లో ప్రజలు**

నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలం రాంరెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కర్నాటి యాదవ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంచి మనసు కలిగిన గ్రామ పెద్ద యాదవ రెడ్డి సర్పంచ్ గతంలో ఎంతో సేవ చేశారని, ఆయన ఏకగ్రీవంగా ఎన్నకవ్వడం అత్యంత ఆనందకర విషయమని గ్రామంలోని యువకులు, మహిళలు, చిన్నా పెద్ద తేడా లేకుండా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# తెల్కపల్లి చౌరస్తాలో శ్రీకాంతాచారికి ఘన నివాళి

**తెల్కపల్లి, సెప్టెంబర్ 03 (నిజాయితి) :** ఈ రోజు తెలంగాణ స్వరాష్ట్ర సాధనకై మలిదశ ఉద్యమంలో అసువులు బాసిన అమరుడు కాసోజు శ్రీకాంత్ చారి 14వ వర్ధంతిని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రం లోని వివేకానంద చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఆయన చిత్ర పటానికి పూల మాలలేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. మండల విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కాకునూరు ప్రశాంత్ ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ 2009 లో మలిదశ తెలంగాణ ఉద్యమం లో తెలంగాణ రాష్ట్ర సాధనకై ఎల్‌బి నగర్ చౌరస్తాలో శ్రీకాంత్ చారి వంటిపై పెట్రోల్ పోసుకొని ప్రాణ త్యాగం చేసిన విషయం ఎవ్వరు మరవలేనిదన్నారు. తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి శ్రీకాంత్ ఆచారి త్యాగాన్ని గుర్తించి ఆయన మాత ృమూర్తి శంకరమ్మకు ఎంఎల్‌సి పదవి ఇచ్చి వారి కుటుంబాన్ని ఆదుకోవాలనికోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ యువకులు, తెలంగాణ ఉద్యమాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీకాంత్ ఆచారికి ఘనంగా నివాళులర్పించారు.



# రాష్ట్ర బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత గాంధీ భవన్ వద్ద మోహరించిన పోలీసులు




హైదరాబాద్, డిసెంబర్ 03: నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. దేవుళ్లపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. నాంపల్లిలోని పీసీసీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ర్యాలీగా బయలుదేరిన బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీజేపీ నేతలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు గాంధీ భవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ నేతలు బుధవారం స్పందిస్తూ..నిరసన వ్యక్తం చేశారు.సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పే వరకు తాము పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. గాంధీ భవన్‌ను ముట్టడించేందుకు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ శ్రేణులు సైతం సమాయత్తమవుతున్నట్లు సమాచారం. గాంధీ భవన్ వద్ద పోలీసులను భారీగా మోహరించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల్లో ఎటువంటి తప్పు లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. నేతల మధ్య ఏమైనా మనస్పర్థలు ఉంటే వాటిని అధిగమించి.. అందరిని కలుపుకుని పోవాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను ఉదాహరించారని చెప్పారు. అంతేకాని హిందూ దేవుళ్లను కించపరిచే ఉద్దేశ్యం సీఎం రేవంత్ రెడ్డికి ఎట్టి పరిస్థితుల్లో లేదని పార్టీ సీనియర్ నేతలు స్పష్టం చేస్తున్నారు. అదీకాక రేవంత్ రెడ్డి పాలనపై విమర్శించేందుకు బీజేపీ నేతలకు ఏ అంశం దొరకలేదని చెప్పారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వారు ఆక్షేపిస్తున్నారని చెప్పారు..

# హాస్టల్ విద్యార్థులను పరామర్శించిన చైల్డ్ వెలేఫేర్ కమిటీ చైర్‌పర్సన్



గద్వాల, సెప్టెంబర్ 03 (నిజాయితి) :బుధవారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఎస్‌టి హాస్టల్‌ను చైల్డ్ వెలేఫేర్ కమిటీ (సిడబ్ల్యూసి) ఛైర్‌పర్సన్ సహదేవుడు, డీసీపీయూ కౌన్సిలర్ సురేష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భనలో హాస్టల్‌లోని మౌలిక వసతులు, ఆహారపు మెనూ, ఆహార నాణ్యత, హాస్టల్ పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను హాస్టల్ వార్డెన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. మంగళవారం ఫుడ్ పాయిజనింగ్‌కు గురైన విద్యార్థులను వ్యక్తిగతంగా పరామర్శించి, వారి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. అనంతరం వంటగది, స్టోర్‌రూమ్‌ను పరిశీలించి, అక్కడ నమోదైన ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతను సమగ్రంగా పరిశీలించారు. పిల్లలతో సదావేంగా మాట్లాడి, వారు తీసుకుంటున్న ఆహారాన్ని కూడా ప్రత్యక్షంగా పరీక్షిస్తూ పిల్లలతో కలిసి టిఫిన్ చేశారు. ఈ సందర్భన సందరరేగా, పిల్లల ఆరోగ్యం, భద్రత, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు %జఔజ% ఛైర్‌పర్సన్ గారు సూచించారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్, హాస్టల్ వార్డెన్ పవన్ కుమారు, హెల్త్ వర్కర్ ఉన్నారు.

# హయత్‌నగర్‌లో బాలుడిపై కుక్కల దాడి

## - చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం ఆదేశం





హైదరాబాద్ నగరంలోని హయత్‌నగర్‌లో మూగబాలుడిపై కుక్కల దాడి ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతడికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. వీధికుక్కల కట్టడి కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు. ఒక్కసారిగా తరిమిన కుక్కల సమూహం : మంగళవారం 15 నుంచి 20 వీధి కుక్కలు ఒకేసారి దాడి చేయడంతో ప్రేమ్‌చంద్ అనే మూగ బాలుడు తీవ్రగాయాలతో ఆసుపత్రి పాలయ్యాడు. ప్రకాశం జిల్లాకు చెందిన సీహెచ్ తిరుపతిరావు, చంద్రకళ దంపతులు ఎల్బీనగర్ మన్సూరాబాద్ సమీపంలోని శివగంగ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు ప్రేమ్‌చంద్ (చింటు) పుట్టుకతో మూగ. నిన్న ఉదయం ఇంటి నుంచి దుకాణంలో సరుకులు కొనుక్కోవడానికి వీధిలోకి వెళ్లినప్పుడు ఒక్కసారిగా కుక్కలు తరుముతూ అతడిపై దాడి చేశాయి.స్వెటర్ లేకపోయినా, ఆలస్యమైనా ప్రాణాలు పోయేవి : ప్రేమ్‌చంద్ దుస్తులను కుక్కలు కొరికేసి మరీ దారుణంగా కరిచాయి. శీతాకాలం కావడంతో ప్రేమ్‌చంద్ స్వెటర్ ధరించాడు. ఆ స్వెటర్‌ను నోటితో కరిచి పట్టుకున్న కుక్కలు బాలుడిని అమాంతం ఈడ్చుకెళ్లాయి. స్వెటర్ లేకుంటే బాలుడి ప్రాణాలతో ఉండేవాడు కాదు. మూగ వాడు కావడంతో కేకలు వేయలేక ప్రేమ్‌చంద్ నిస్సహాయంగా పడిపోయాడు. అది గమనించిన ఓ స్థానికుడు కర్రతో కుక్కలను బెదిరించి వాటిని తరిమికొట్టాడు. అనంతరం 108కు సమాచారం ఇచ్చారు.తొలుత బాలుడిని నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యుల సూచనతో నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఎమర్జెన్సీ వార్డులో ఉంచి అతడికి ట్రీట్‌మెంట్ అందిస్తు న్నారు. ఈ ఘటనలో బాలుడి చెవి తెగిపోయింది. దానికి శస్త్ర చికిత్స చేసినట్లు వైద్యులు తెలిపారు. తల, నడుము, వీపు భాగాల్లో ఘోరంగా తీవ్ర గాయాలయ్యాయి. కాస్త ఆలస్యమైతే కుక్కల దాడిలో ప్రేమ్‌చంద్ ప్రాణాలు కోల్పో యేవాడని డాక్టర్లు తెలిపారు.చీఫ్ వెటర్నరీ అధికారి హాజరుకు న్యాయస్థానం ఆదేశం : వీధి కుక్కల నియంత్రణలో భాగంగా సుప్రీంకోర్టు మార్గద ర్శకాలను కచ్చితంగా అమలు చేయాల్సిందేనం టూ ప్రభుత్వానికి, జీహెచ్ఎంసీకి మంగళవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీధి కుక్కలను పట్టుకొని స్టెరిలైజేషన్ చేసి, టీకాలు వేసిన తరువాత వాటిని ఆశ్రయ కేంద్రాలకు తరలిం చాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈనెల 9న చీఫ్ వెటర్నరీ అధికారి వ్యక్తిగతంగా కానీ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారాగానీ కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది.వీధి కుక్కల నియం త్రణలో న్యాయస్థానం మార్గదర్శకాలను అమలు చేయాలన్న వినతి పత్రాలను పట్టించుకోకపోవడాన్ని సవాలు చేస్తూ అసోసియేషన్ ఫర్ యానిమల్ షెల్టర్ అండ్ రెస్క్యూ ఎయిడ్ (ఆస్రా) సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. వాదనలను విన్న తర్వాత రెండు యానిమల్ బర్త్ కంట్రోల్ సెంట ర్లను సందర్శించి మొబైల్‌తో చిత్రీకరించడానికి పిటిషనర్‌కు అనుమతించాలని, ఇందులో ఎలాంటి ఇబ్బందులు సృష్టిం˘రాదంటూ విచారణను ఈనెల 9వ తేదీకి వాయిదా వేశారు.

# కాంగ్రేస్ బలపరిచిన శేఖరయ్య గెలుపుకే అవకాశాలు మెండు



తెల్కపల్లి, సెప్టెంబర్ 03 (నిజాయితి) :తెల్కపల్లి మేజర్ గ్రామ పంచాయితీ స్పంచ్‌గా కొమ్ము శేఖరయ్య (ఎల్ఐసి శేఖర్) కు అవకాశాలు మెండుగా ఉన్నాయని స్థానికులు భావిస్తున్నారు. తెల్కపల్లి మేజర్ గ్రామ పంచాయితీ స్పంచ్ అభ్యర్థిగా కాంగ్రేస్ పార్టీ బలపరిచిన కొమ్ము శేఖరయ్యకు మద్దతుగా నిలిచిన స్థానిక నాయకుల సూచన మేరకు శ్రద్ధ తీసుకున్న నాగర్‌కర్నూల్ ఎంఎల్ఏ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మిగిలిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గుగ్గిళ్ల ప్రకాష్, బండారు బాలరాజ్, తుమ్మ నర్సింహాలకు నచ్చచెప్పి పోటీ నుండి విరమింప జేశారు. దీంతో కొమ్ము శేఖరయ్య (ఎల్ఐసి శేఖర్) గెలుపు దాదాపు కాయమైందని స్థానిక ప్రజలు గట్టిగా భావిస్తున్నారు. గుగ్గిళ్ల ప్రకాష్, బండారు బాలరాజ్, తుమ్మ నర్సింహాలు మాట్లాడుతూ ఎంఎల్ఏ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఆధేశానుసారం తమ నామినేషన్‌లను విత్ డ్రా చేసుకున్నామని, కొమ్ము శేఖరయ్య గెలుపుకోసం పూర్తి స్థాయిలో పాటుపడుతామని ఈ సందరరేగా వివరించారు.

# రవికి పోలీసులు బంఫర్ ఆఫర్






హైదరాబాద్, డిసెంబర్ 03: టెక్నాలజీపై ఉన్న పట్టుతో కొత్త సినిమాలను పైరసీ చేసి.. చిత్ర పరిశ్రమకు ఐ బొమ్మ రవి చుక్కల చూపించారు. అలాంటి రవికి పోలీసులు బంపర్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అతడి తెలివితేటలను విచారణలో భాగంగా పోలీస్ ఉన్నతాధికారులు గుర్తించారు. పోలీసు శాఖలోని సైబర్ క్రైమ్ విభాగంలో పని చేస్తావా? అంటూ రవిని వారు అడిగినట్లు సమాచారం. మంచి జీతం సైతం ఇస్తామని అతడికి ఆఫర్ చేశారని తెలుస్తోంది. రవి మాత్రం వారి ఇచ్చిన ఆఫర్‌ను తిరస్కరించారట.ఇమ్మడి రవిని కస్టడీలోకి తీసుకుని విచారించిన పోలీసులు అనేక కొత్త విషయాలు రాబట్టినట్లు తెలుస్తోంది. విచారణలో భాగంగా 'ఐ బొమ్మ క్లోజ్ అయింది. కదా.. తర్వాత ఏం చేస్తావంటూ' రవిని పోలీసులు ప్రశ్నించారు. కరేబియన్ దీవుల్లో రెస్టారెంట్ ఏర్పాటు చేస్తానని వారికి చెప్పినట్లు సమాచారం.ఆ రెస్టారెంట్‌లో తెలంగాణ, ఆంధ్రా తోపాటు దేశంలోని వివిధ ప్రముఖ వంటకాలను ఆ దీవుల్లోని ప్రజలకు రుచి చూపించడం ద్వారా డబ్బు సంపాదిస్తానని సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. మరి ఆ రెస్టారెంట్‌కు ఏం పేరు పెడతావంటూ రవిని పోలీసులు ప్రశ్నించగా.. ఐ బొమ్మ పేరే పెడతానని రవి ఈ సందర్భంగా పోలీసులకు స్పష్టం చేసినట్లు సమాచారం.

# శ్రీశైలం మల్లన్న స్పర్శ దర్శనం నిలుపుదల

## - డిసెంబరు 8 వరకు రద్దీ కారణంగా నిర?యం

శ్రీశైలం, డిసెంబర్ 3 (నిజాయితి) శ్రీశైలం శ్రీ బ్రహ్మారాంబ మల్లికార్జున స్వామివార్ల దేవస్థానంలో భక్తుల భారీ రద్దీ కారణంగా సాధారణ భక్తులకు స్పర్శదర్శనాన్ని డిసెంబరు 8వ తేదీ వరకు నిలిపివేస్తున్నట్లు ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వాహక అధికారి శ్రీ యం. శ్రీనివాసరావు సంయుక్తంగా ప్రకటించారు.కార్తీకమాస శివదీక్షా విరమణ డిసెంబరు 1 నుంచి ప్రారంభం కావడంతో శివదీక్షా భక్తుల రద్దీ భారీగా పెరిగింది.ఈ నేపథ్యంలో సాధారణ భక్తులకు స్పర్శదర్శనాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.శివదీక్షా విరమణ ముగిసే డిసెంబరు 5వ తేదీ వరకు, జ్యోతిర్ముడి ధరించిన శివదీక్షాధారులకు మాత్రం ప్రతి రెండు గంటలకు ఒకసారి విడతల వారీగా స్పర్శదర్శనం అందించనున్నారు.వారాంతపు సెలవులు, సోమవారం నేపథ్యంతో డిసెంబరు 6, 7, 8 తేదీలలో కూడా రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో, ఈ మూడు రోజుల పాటు కూడా అందరికీ అలంకార దర్శనం మాత్రమే కల్పించనున్నారు.భక్తుల సౌకర్యం కోసం తీసుకున్న ఈ నిర?యాన్ని అందరూ గమనించి దేవస్థానానికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ఫ్యూచర్ సిటీ ఓ పెద్ద స్కామ్




హైదరాబాద్: పారిశ్రామికీకరణ వల్ల దెబ్బతిన్న దేశాలు చాలా ఉన్నాయని, మానవీయ కోణం లేకుండా ఏ అభివృద్ధి అయినా విధ్వంసానికి దారి తీస్తుందని పలువురు వక్తలు అన్నారు. ఫ్యూచర్ సిటీ అనేది పెద్ద స్కామ్ అని, రాష్ట్ర ప్రభుత్వం హిల్ట్ పాలసీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిగ్నల్ టీవీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హిల్ట్ పాలసీ స్కీమా.. స్కామా అనే అంశంపై సీనియర్ జర్నలిస్ట్ శివారెడ్డి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. పారిశ్రామికీకరణ జరిగినంత మాత్రాన మానవ అభివృద్ధి జరగదని, ఇలాంటి అభివృద్ధితో ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు.మానవ విలువలు, జీవన ప్రమాణాలు మెరుగు పడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వానికి ఇండస్ట్రీ పాలసీ మీద స్పష్టత లేదని, పాశ్చాత్య అభివృద్ధి నమునాపై జాగ్రత్తగా ఆలోచించాలని చెప్పారు. సీనియర్ జర్నలిస్ట్ విజయ్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ చుట్టూ 9 వేల ఎకరాలు హిల్ట్ పాలసీలో భాగంగా ఇతర అవసరాల కోసం కేటాయించారని, దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో ఓ శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. చండీగఢ్‌పై జరిగిన కుట్ర మాదిరిగా కేంద్ర ప్రభుత్వం ఇతర నగరాలపై కూడా కన్నేసిందని ఆరోపించారు. రాజకీయ నాయకుల స్వార్థంతో హైదరాబాద్ నగరం పూర్తిగా నాశనం అయ్యే పరిస్థితి దాపురించిందని, బీజేపీ కూడా దీనికి సహకరిస్తున్నట్లు తెలుస్తున్నదని అన్నారు. పర్యావరణ వేత్త పాపారావు మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీ అనేది పెద్ద స్కామ్ అని, సెంట్రల్ యూనివర్సిటీ భూములను కూడా సేకరించాలని చూశారని, సుప్రీంకోర్టు చీవాట్లు పెడితే ఊరుకున్నారని తెలిపారు. కాలుష్యంపై అవగాహన లేకుండా భూములు సేకరించాలని చూస్తున్నారని చెప్పారు. ఎంఎసఎంఈ జేఏసీ చైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు భూముల అవసరమని, భూములు విక్రయిస్తారా? లీజుకు ఇస్తారా? అనేది ప్రభుత్వ నిర్ణయం తీసుకోవాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్ శైలేష్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో రాజకీయాలన్నీ భూముల చుట్టే తిరుగుతున్నాయన్నారు.హిల్ట్ పాలసీ పెద్ద భూ దోపిడీ అని విమర్శించారు. బక్క జడ్సన్ మాట్లాడుతూ కాంగ్రెస్ తెచ్చిన ప్రతి పాలసీ దోపిడీ కోసమే, రేవంత్‌రెడ్డి ఆలోచనలన్నీ లాక్కోవడానికేనని అన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ నగరం రూపురేఖలు మార్చే హిల్ట్ పాలసీపై తొందర ఎందుకని, దీనిపై విస్తృత చర్చ జరగాలని అన్నారు. ఇన్ని వేల ఎకరాలు అన్యాక్రాంతం చేస్తుంటే ఎవరూ చూస్తూ ఊరుకోరని తెలిపారు. విస్తృత చర్చ లేకుండా ఈ పాలసీ ఎలా తెచ్చారని బీఆర్ఎస్ నాయకుడు చాడ వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు ప్రకాష్ రెడ్డి, మర్రి ప్రభాకర్, రమణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు.

# తెల్కపల్లి బిఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన బారిగారి లక్ష్మణ్ కాంగ్రేస్ తీర్థం



తెల్కపల్లి, సెప్టెంబర్ 03 (నిజాయితి) :
తెలకపల్లి కి చెందిన టిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు భారీగారి లక్ష్మణ్ ఈరోజు సాయంకాలం మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి సమక్షంలో కాంగ్రేస్ పార్టీలో చేరడం జరిగినది. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీ మారడం జరిగిందని తెలియజేశారు. స్థానిక సంస్థల ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు కృషి చేస్తానని తెలియజేశారు.

# రేవంత్ సర్కార్ అంటే అప్పులు చేయడం ప్రభుత్వ భూములు అమ్మడం



హైదరాబాద్:రేవంత్ సర్కార్ అంటే అప్పులు చేయడం, ప్రభుత్వ భూములు అమ్మడం అని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి విమర్శించారు. తెలంగాణ ప్రాంత ప్రయోజనాలకు కాంగ్రెస్ విఘాతం కలిగిస్తోందని ఆరోపించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసమే రేవంత్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ పోరుబాట పట్టింది. ఈ నేపథ్యంలో మౌలాలి ఇండస్ట్రియల్ ఏరియాలో బీఆర్ఎస్ నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి, ఎమ్మెల్యే మర్రి నిరసన దీక్షలు చేపట్టారు. తెలంగాణను దోచుకుంటున్న దండుపాళ్యం ముఠా అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. హిల్ట్ పాలసీని రద్దు చేయాలని నినాదాలు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను మధుసూదనాచారి తీవ్రంగా ఖండించారు. తెలంగాణ సంపదను రేవంత్ రెడ్డి దోచుకుంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలోనే హైదరాబాద్ అభివృద్ధి జరిగిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌కు అనేక కంపెనీలు క్యూ కట్టాయని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో ప్రపంచంతోనే పారిశ్రామికరంగంలో పోటీపడ్డామని గుర్తుచేశారు. కానీ రేవంత్ రెడ్డి హైదరాబాద్ బ్రాండ్‌ను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నారని అన్నారు.తెలంగాణకు కాంగ్రెస్ ద్రోహం చేసిందని మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ జాతిని అవమానించడమే కాంగ్రెస్ విధానమని విమర్శించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలను నరకం చూస్తున్నారని అన్నారు. కమీషన్ల కోసం ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హిల్ట్ పాలసీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# పన్నుల వసూళ్లకు సమానంగా ఏపీకి పంపిణీ



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో రాష్ట్రాల వారీగా సేకరించిన ప్రత్యక్ష పన్నులు, స్థూల జీఎస్టీ వసూళ్ల మొత్తం రూ.111.75 లక్షల కోట్లు కాగా.. ఆ కాలంలో రాష్ట్రాలకు పన్ను పంపిణీ, ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల రూపేణా కేంద్రం బదిలీ చేసిన మొత్తం రూ.75.12 లక్షల కోట్లు అని కేంద్రం వెల్లడించింది. రాజ్యసభలో సీపీఎం సభ్యుడు జాన్ బ్రిటాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఏపీ నుంచి రూ.3.32 లక్షల కోట్లు వసూలు కాగా, కేంద్రం ఏపీకి రూ.3.23 లక్షల కోట్లు బదిలీ చేసిందన్నారు. ఏపీలో వసూళ్లకు దాదాపు సమానంగా కేంద్రం నుంచి నిధులు బదిలీ అయ్యాయని పంకజ్ చౌదరి వివరించారు.

# ఆర్థిక కారిడార్ అమరావతి




**అమరావతి :** రాజధాని అమరావతి ఎకనామిక్ కారిడార్‌గా అవతరించబోతోంది. ఇటీవల సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అమరావతి ఎకనామిక్ జోన్‌లో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఎన్‌టీఆర్, ఏలూరు, త్వరలో ఏర్పడబోయే మార్కాపురం జిల్లాలుంటాయి. ఈ నేపథ్యంలో అమరావతి ఎకనామిక్ కారిడార్‌కు త్వరలోనే రూపకల్పన జరగనుంది. విజన్ ప్రణాళికలు రూపకల్పన జరిగి కార్యరూపం దాల్చితే అమరావతి ఎకనామిక్ కారిడార్ రాష్ట్రానికే తలమానికంగా మారుతుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా అమరావతి ఎకనామిక్ కారిడార్ కార్యకలాపాల పర్యవేక్షణకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రభుత్వం నియమించనుంది. ఈ కారిడార్ రాష్ట్రానికి కేంద్ర బిందువుగా ఉండనున్న దృష్ట్యా ప్రధానంగా ఫైనాన్స్, డీప్ టెక్నాలజీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) సంస్థలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. రాజధానిలో ఇప్పటికే క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. మరోవైపు అమరావతిలో ఆర్థిక నగరాన్ని నిర్మించేందుకు ఇటీవలే అంకురార్పణ జరిగింది.దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా ఒకే రోజున 15 జాతీయ బ్యాంకులు, బీమా కంపెనీలు రీజినల్ కార్యాలయాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశాయి. కంపెనీలు కూడా త్వరలోనే వాటి కార్యాలయాల నిర్మాణాలను ప్రారంభించనున్నాయి.

# వివేకా హత్య కేసు కోర్టు ఏం చెప్పబోతోంది కొనసాగుతున్న హైటెన్షన్



**కడప, డిసెంబరు3 :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో () సమగ్ర దర్యాప్తు జరపాలని సీబీఐ కోర్టులో () ఆయన కూతురు సునీతారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం) న్యాయస్థానం విచారణ చేసింది. ఈ క్రమంలో సునీత వేసిన పిటిషన్‌పై వాదనలు పూర్తి అవడంతో తీర్పును రిజర్వ్ చేసింది సీబీఐ కోర్టు. ఈ నెల 10వ తేదీన తీర్పు వెల్లడించనుంది సీబీఐ కోర్టు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు జరిపించేలా సీబీఐకు న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వాలంటూ సునీత న్యాయవాదులు వాదనలు వినిపించారు.తన తండ్రి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపకపోతే అసలైన వ్యక్తులు తప్పించుకునే ప్రమాదం ఉందని పేర్కొన్నారు సునీత. ఇదే కేసులో సప్లమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసేలా సీబీఐకి ఆదేశాలు ఇవ్వాలని సీబీఐ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు సునీత తరుపు న్యాయవాది. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు జరిపితే ఇప్పటివరకు వెలుగు చూడని సంచలన విషయాలు బయటకు వస్తాయని అభిప్రాయపడ్డారు సునీతారెడ్డి.

# ఏపీలో ఎన్నికల హడావుడి.షెడ్యూల్ విడుదల



**అమరావతి, డిసెంబరు3 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఈ నెల 23వ తేదీన జరగనున్నాయి. ఏపీ సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం ఎన్నికల నిర్వహణపై అప్సా అధ్యక్షులు కాకర్ల వెంకటరామిరెడ్డి అధ్యక్షతన కార్యవర్గం ఇవాళ(బుధవారం) సమావేశమైంది. ఈ సమావేశంలో పలు కీలక నిర?యాలు తీసుకున్నారు.ఈ నెల 29వ తేదీతో ప్రస్తుత అప్సా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ప్యానెల్ పదవీ కాలం ముగియనుంది. ఈ క్రమంలో ఎన్నికలను ఈ నెల(డిసెంబరు) 23వ తేదీన నిర్వహించాలని అప్సా కార్యవర్గం నిర?యం తీసుకుంది. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను అప్సా కార్యవర్గం ప్రకటించింది. తొమ్మిది కేటగిరీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సచివాలయం, అసెంబ్లీతో కలిపి 1200 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

# ఏపీలో స్క్రబ్ టైఫస్ అలర్ట్



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలను స్క్రబ్ టైఫస్ వ్యాధి వణికిస్తోంది. ఈ వ్యాధి బారిన పడిన వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇటీవల వారం వ్యవధిలోనే ఏడు కేసులు నమోదయ్యాయి. విజయనగరం జిల్లాలో ఈ వ్యాధి బారిన పడి రాజేశ్వరి అనే మహిళ మృతిచెందడంతో ఆందోళనలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ సీఎం చంద్రబాబు రంగంలోకి దిగారు. స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్క్రబ్ టైఫస్ తీవ్రత పెరగకముందే.. ఈ వ్యాధి బారిన పడిన వారికి చికిత్స అందించాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు.రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో.. కేసుల నమోదుపై వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్‌తో మంగళవారం (డిసెంబర్ 2) రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఇటీవల విజయనగరం జిల్లాలో స్క్రబ్ టైఫస్ వల్ల రాజేశ్వరి అనే మహిళ మృతిచెందడం గురించి ప్రస్తావించిన సీఎం.. ఇలాంటి ఘటనలు మరెక్కడా జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కీటకాలు కుట్టడం వల్ల చనిపోయే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా ఈ పురుగుల బారిన పడకుండా.. ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని చెప్పారు.కాగా, విజయనగరం జిల్లాలో రాజేశ్వరి అనే మహిళను చిగ్గర్‌మైట్ అనే కీటకం కుట్టిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఆ తర్వాత ర్యాపిడ్ పరీక్ష చేయగా స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా తేలిందని చెప్పారు. స్క్రబ్ టైఫస్ అంటువ్యాధి కాదని.. ఈ కీటకం కుడితే శరీరంపై దద్దుర్లు, పుండ్లు ఏర్పడతాయని తెలిపారు. అధిక జ్వరం, చలి, తీవ్ర తలనొప్పి, కండరాల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయని వెల్లడించారు. సకాలంలో చికిత్స అందిస్తే ఎలాంటి ఇబ్బందీ ఉండదని వివరించారు. అయితే ప్రభావిత ప్రాంతాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా.. కీటకాలు కుట్టిన వెంటనే వైద్యులను సంప్రదించేలా అవగాహన కల్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారుఇలా చేయకుంటే ప్రమాదం!స్క్రబ్ టైఫస్ వ్యాధి రాకుండా ఉండాలంటే.. ముందుగా లార్వల్ మైట్స్ (%శ్రీ%పురుగులను దగ్గరికి రానివ్వొద్దు. అందుకోసం ఇంటి పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా చూసుకోవాలి. ఇంట్లో పొడి వాతావరణం ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలి. తడిసిన దుస్తులు ధరించొద్దు. కాళ్లు, చేతులు పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను వేసుకోవాలి. పంట పొలాల్లో పనిచేసేటప్పుడైనా, ఇంట్లో ఉన్న సమయంలోనైనా ఏదైనా పురుగు కుట్టినట్లు అనిపిస్తే.. వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. ఈ వ్యాధి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేకపోయినా.. నిర్లక్ష్యం చేయకూడదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఉండే ప్రజలు జాగ్రత్తగా పాటించాలని సూచిస్తున్నారు.

# జగన్ హయాంలో భూ రికార్డులు తారుమారు సీఎం చంద్రబాబు ఫైర్



**తూర్పుగోదావరి జిల్లా, డిసెంబరు3 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో వ్యవసాయం అస్తవ్యస్థం అయ్యిందని విమర్శలు చేశారు. (బుధవారం) తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలోని నల్లజర్లలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. అనంతరం మీడియాతో ప్రసంగించారు సీఎం చంద్రబాబు.వైసీపీ హయాంలో భూములు కబ్జా చేయడానికి 22ఏ విధానం.వైసీపీ హయాంలో భూ రికార్డులు తారుమారు చేశారని ఆరోపించారు. ఇష్టం ఉంటే భూరికార్డులు అలాగే ఉంచారని.. భూములు కబ్జా చేయాలనుకుంటే 22ఏ విధానం అనుసరించారని ఆరోపించారు. వైసీపీ నేతలు ప్రభుత్వ భూములను ఆక్రమించారని విమర్శించారు. గత జగన్ ప్రభుత్వం పశువులకు దాణా కూడా ఇవ్వలేదు. వైసీపీ అక్రమాలను అరికట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పవన్ కల్యాణ్‌లతో కూటమి కట్టి ఎన్నికలకు వెళ్లామని గుర్తుచేశారు. చరిత్రలో ఎప్పుడు లేనంతగా రికార్డు సీట్లను తమకు ప్రజలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. 90 శాతం సీట్లను తమకు ప్రజలు ఇచ్చారని గుర్తుచేశారు. మొదటగా రైతుల సమస్యలు పరిష్కరించాలని అనుకున్నామని దాని తర్వాత మిగతా సమస్యలపై దృష్టి సారించామని తెలిపారు. వ్యవసాయంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు.వ్యవసాయం ద్వారా ఆరు శాతం ఆదాయం.'వ్యవసాయం ద్వారా రాష్ట్రానికి ఆరు శాతం ఆదాయం వస్తుంది. వ్యవసాయంలో ఖర్చులెక్కువ ఆదాయం తక్కువ. వ్యవసాయమే మన బలం.. ఈరంగంలో అనేక సమస్యలు వస్తున్నాయి. వ్యవసాయంలో జూదం వద్దు. సమస్యలు అన్ని ఒకేసారి పరిష్కారం అయిపోతాయని భావించి ముందుకు వెళ్తే, నష్టపోయే పరిస్థితి వస్తుంది. రైతుల్లో కూడా మార్పు రావాలి. మేము రూపాయి ఇస్తే, మీరు రుపాయి ఖర్చుపెట్టాలి. చదువుకునే పిల్లలు కూడా వ్యవసాయం అంటే పొలాల నుంచే నేర్చుకోవాలి. ప్రస్తుతం వ్యవసాయ పనులు చేయడానికి ప్రజలు ముందుకు రావడం లేదు.. అందుకే యాంత్రికరణ జరగాలి. మీరు పండించే పంట విలువ ఇక్కడ పరిస్థితిపై ఆధారపడి ఉండదు. ఇతర దేశాలు, ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలపై ఆధారపడి ఉంటాయి. రైతులకు గిట్టుబాటు ధర రావాలి.. ఆదాయం పెరగాలి. ఇప్పుడు ఉభయ గోదావరి జిల్లాల వాసులతో పాటు రాయలసీమ వాసులకు డయాబెటిస్ వస్తోంది. రాష్ట్రాన్ని ఒక మోడల్ స్టేట్‌గా మారుస్తాం. విశాఖపట్నం సమ్మిట్‌లో ఎప్పుడూ రానంత పెట్టుబడులు వచ్చాయి' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. నదులను అనుసంధానం చేస్తాం. 'జఠిలమైన వ్యవసాయ సమస్య పరిష్కరించడానికి ఐదు సూత్రాలు అమలు చేస్తున్నాం. ఇందులో భాగంగానే నీటి భద్రత కల్పించాలని భావించాం. గంగా, కావేరి నదులను అనుస ంధానం చేయాలని అప్పుడే నిర్ణయించాం. ఇప్పట్లో సాధ్యం కాదని, కనీసం మన రాష్ట్రంలో నదులను అనుసంధానం చేయా లని నిర్ణయించాం. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు ఎట్టి పరిస్థి తుల్లోనైనా తరలిస్తాం. భూమిని జలాశయంగా చేసి, భూగర్భ జలాలు పెంచితే నీటి సమస్య ఉండదు. నేను చాలా సమస్యలు పరిష్కరించగలను. రైతుల సమస్యలు పరిష్కరించడానికి కొంత సమయం పడుతుంది. గతంలో రాష్ట్రాన్ని అస్తవ్యస్థం చేశారు. కరెంటు చార్జీలను పెంచబోం. గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేస్తున్నాం. పెన్నా నది వరకు తీసుకువెళ్తాం. ప్రతీ ఎకరానికి నీరు అందేలా చేస్తాం. ఏపీలో తాగడానికి, వ్యవసాయానికి, పారిశ్రామికరంగానికి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలి




హైదరాబాద్ : ఏపీ డిప్యూటీ సీఎం పదవికి పవన్ కళ్యాణ్ అనర్హుడని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కే నారాయణ విమర్శించారు. ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కోనసీమ జిల్లా పర్యటన సందర్భంగా పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టేలా, ఐక్యతకు భంగం కలిగించేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.తెలుగు రాష్ట్రాలు సాంకేతికంగా విడిపోయినప్పటికీ.. ప్రజలు కలిసే ఉన్నారని నారాయణ తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుమార్తెను ఏపీలోని భీమవరం ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చిన తొలిరోజుల్లో తనకు చేగువేరా ఆదర్శమని చెప్పాడని.. ఇప్పుడు సావర్కర్‌ను భుజాన వేసుకుని సనాతన ధర్మం అంటూ తిరుగుతున్నాడని విమర్శించారు. సనాతన ధర్మం కోసం తిరగాలని అనుకుంటే తమకేమీ అభ్యంతరం లేదని.. కాకపోతే రాజకీయాలను వదిలేసి ఆ పనిచేసుకోవాలని హితవుపలికారు.దిష్టి తగిలింది వంటి మాటలు మాట్లాడే సనాతనవాదికి రాజకీయాల్లో ఉండే అర్హత లేదని నారాయణ వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ రాజకీయాలకు తగదని పేర్కొన్నారు. తక్షణమే పవన్ కల్యాణ్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

# రైతన్నా మీ కోసం రెట్టింపు చేయడమే లక్ష్యం




**శ్రీ సత్య సాయి :** రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం రూపొందించిన పంచసూత్రాలు ప్రతి రైతు వరకు చేరాలనే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమమే "రైతన్నామీ కోసంఈ అవగాహన కార్యక్రమం ఈ రోజు కదిరి నియోజకవర్గంలోని గాండ్లపెంట మండలం కురుమామిడి పంచాయతీ రెక్కమాను రైతు సేవ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద మాట్లాడుతూ ప్రభుత్వం దీర్ఘకాలిక దూరదృష్టితో రూపొందించిన పంచసూత్రాలు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యమని తెలిపారు.నూతన విధానాలు, ఆధునిక సాంకేతికత, తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు, పంట భీమా, నీటి వినియోగ సమర్థత వంటి అంశాలను రైతులు అవలంబిస్తే.. వ్యవసాయం మళ్లీ లాభదాయక రంగమవుతుందని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాలు రైతుల సమస్యలకు పరిష్కార వేదికగా మారాలనేది ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు.రైతు కుటుంబాలన్నింటికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా "రైతన్నా మీ కోసం" కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించామని ఆయన తెలిపారు. గ్రామస్థాయిలో నేరుగా రైతు ఇంటికే వెళ్ళి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, రైతు సమస్యలు ప్రభుత్వం దృష్టికి చేరేలా అంకితభావంతో పని చేస్తామని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయశాఖ అధికారులు పంచసూత్రాల్లోని కీలక అంశాలను వివరించారు. ముఖ్యంగా 1. తక్కువ వ్యయంతో అధిక దిగుబడి పద్ధతులు. 2. ఆధునిక సాగు విధానాలు, డ్రిప్‌స్ప్రింక్లర్ టెక్నాలజీ, 3. నాణ్యమైన విత్తనాలు, ఎరువుల అందు బాటు 4. పంటలకు మార్కెట్ హామీ, ధరల స్థిరీక రణ, 5. రైతు భీమా, సహాయక పథకాల ప్రయో జనాలు, వీటి పై విపులంగా రైతులకు సూచనలు ఇచ్చారు.వర్క్‌షాప్‌లో పాల్గొన్న రైతులు ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాలపై సానుకూల స్పందన వ్యక్తం చేస్తూ, ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని అభ్యర్థించారు. పంటల సమస్యలు, కొనుగోలు విధానాలు, పంట నష్ట పరిహారం, నీటి అందుబాటు వంటి అంశాల పై కూడా రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మండల ఎన్డీయే కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, రైతుసంఘం నాయకులు పెద్ద సంఖ్యలో రైతు సోదరులు పాల్గొని వర్క్‌షాప్‌ను విజయవంతం చేశారు. గ్రామస్థాయిలో రైతుల ఆర్థిక స్థితి మెరుగుపరచడం లక్ష్యంగా చేపట్టిన "రైతన్నా%శా% మీ కోసం" రైతుల్లో చైతన్యాన్ని పెంపొందిస్తోందని నిర్వాహకులు తెలిపారు.

# శ్రీశైలం దేవస్థానం మరో కీలక నిర్ణయం వారికి ఉచిత స్పర్శ దర్శనం



**నంద్యాల, డిసెంబరు3 :** శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇరుముడి కలిగిన శివస్వాములకు మాత్రమే ఉచిత స్పర్శ దర్శనం కల్పించాలని నిర్ణయించింది. భక్తుల రద్దీ నేపథ్యంలో ఈనెల 7వ తేదీ వరకు సాధారణ భక్తులకు స్పర్శ దర్శనాన్ని రద్దు చేసింది దేవస్థానం. శివస్వాములకు మాత్రమే విడతల వారీగా స్పర్శదర్శనం కల్పించాలని నిర్ణయం తీసుకుంది. ఈనెల 7వ తేదీ వరకు సాధారణ భక్తులకు స్వామివారి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి ఇచ్చింది.ఆన్‌లైన్ ద్వారా భక్తులు భారీగా స్పర్శదర్శనం కోసం నమోదు చేసుకుంటున్నారు. భక్తులు భారీగా తరలివస్తుండటం, మరోవైపు శివస్వాములు కూడా మాల తీయడానికి ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలి రావడంతో స్పర్శ దర్శనానికి సమయం పడుతోంది. ఈ క్రమంలోనే ఇరుముడి కలిగిన శివస్వాములకు మాత్రమే స్పర్శ దర్శనం కల్పించాలని దేవస్థానం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.అయితే, భక్తులకు అల్పాహారాలు, తాగునీరు, తదితర వసతులను ఎప్పటికప్పుడు కల్పిస్తున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

# బీజేపీ రాష్ట్ర చీఫ్ ఆసక్తికర కామెంట్స్



**చెన్నై:** వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి మెజారిటీ విజయాన్ని సాధిస్తుందని, అన్నాడీఎంకే తప్పకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ స్పష్టం చేశారు. మదురైలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, మతవాదాన్ని గట్టిగా నమ్ముతున్న బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నందు వల్ల అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పడదని డీఎంకే అసత్యప్రచారాలు చేస్తోందని,వాస్తవానికి రాష్ట్రంలో కమలం పార్టీ అభివృద్ధి చెందుతోందన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమిలో ఉన్న అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పడాలని తాము ఆశిస్తున్నామని, పలు చీలికలుగా విడిపోయిన ఆ పార్టీకి మళ్లీ పూర్వవైభవం వస్తుందన్నారు. మాజీ బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు అన్నామలై ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్తగా పార్టీ ప్రారంభించబోరని, ఆయన బీజేపీతో సన్నిహితంగానే ఉన్నారన్నారు.

# విజయ్ రోడ్‌షోకు అనుమతి నిరాకరణ



'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధ్యక్షుడు విజయ్() ఈ నెల 5వ తేదీ పుదుచ్చేరి()లో చేపట్టదలచిన రోడ్‌షోకు పోలీసులు అనుమతి నిరాకరించారు. టీవీకే వినతిపత్రాన్ని పరిశీలించిన ఐజీ అజిత్‌కుమార్‌సింగ్ అనుమతి నిరాకరిస్తున్నట్లు ప్రకటించారు. దీనిపట్ల టీవీకే శ్రేణులు, విజయ్ అభిమానులు తీవ్ర నిరాశతో వున్నారు. ఈ నేపథ్యంలో పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ సెల్వం పోలీసుల వైఖరిని సమర్థించారు.విజయ్‌కు అనుమతివ్వకపోవడం మంచిదేనని వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. చిన్ననగరమైన పుదుచ్చేరిలో రోడ్‌షో నిర్వహిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని, తమిళనాడులో లాగా ఇక్కడ పెద్దరోడ్లు లేవన్నారు. అవసరమైతే విజయ్ ప్రైవేటుగా ఓ మైదానాన్ని ఎంపిక చేసి అందులో సభ జరుపుకోవడం తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.

# ఢిల్లీ కళాశాలలకు బాంబు బెదిరింపులు



**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ లో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. నగరంలోని రెండు కళాశాలలకు బుధవారం ఉదయం బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన పోలీసులు అక్కడికి చేరుకొని తనిఖీలు చేపట్టారు.ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన రెండు కళాశాలలకు బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నార్త్ క్యాంపస్‌లోని రాంజాస్ కళాశాల, కల్కాజీలోని దేశ్‌బంధు కళాశాలకు ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన కళాశాల యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. విద్యార్థులను, సిబ్బందిని బయటకు పంపి సోదాలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ ఐదుగురు మావోయిస్టుల మృతి



**ఛత్తీస్‌గఢ్ :** రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో బుధవారం భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భద్రతా బలగాలకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు సమాచారం. డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా భద్రతా బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. పశ్చిమ బస్తర్ డివిజన్ ప్రాంతంలో మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య భీకర ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి.మన్యంలో టెన్షన్ వాతావరణం.మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్లు జిల్లాపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ప్రస్తుతం మన్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల మారేడుమిల్లి ప్రాంతంలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్ల ప్రభావం ఇంకా తగ్గలేదు. ఇలాంటి సమయంలో మంగళవారం నుంచి మావోయిస్టు పార్టీకి చెందిన పీఎల్‌జీవో వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. దీంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఆందోళన కొనసాగుతోంది.

# పాక్ ఆరోపణలపై భారత్ కౌంటర్- శ్రీలంకకు గడువు తీరిన పదార్థాలు పంపి దాయాది నవ్వులపాలు

దిత్వా తుపాను ప్రభావంతో కష్టాల్లో ఉన్న శ్రీలంకకు పంపే మానవతాసాయం విమానాలపై పాకిస్థాన్? చేస్తున్న విమర్శలను భారత్ తిప్పికొట్టింది. సహాయక పదార్థాలతో శ్రీలంకకు వెళ్తున్న విమానానికి భారత్ అనుమతి ఇవ్వలేదంటూ పాకిస్థాన్ ఆరోపణలను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఖండించారు. పాకిస్థాన్ ప్రకటనలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని తెలిపారు. పాకిస్థాన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించిన ఆయన, భారత వ్యతిరేక ప్రచారంలో ఇదొకటని అభిప్రాయపడ్డారు. పాకిస్థాన్? చేసిన విజ్ఞప్తిని కేవలం కొన్ని గంటల్లోనే పరిష్కరించమని తెలిపారు. 2025 డిసెంబర్ 1 మధ్యాహ్నం ఒంటిగంటకు విజ్ఞప్తి చేయగా, మానవతా సాయం దృష్ట్యా అదే రోజు సాయంత్రం 5. 30 గంటలకు అనుమతి ఇచ్చామని స్పష్టం చేశారు. ప్రకృతి విపత్తుల సమయంలో శ్రీలంకకు మద్దతుగా నిలవడంలో భారత్ ఎప్పుడూ అండగా ఉంటుందని మరోసారి తెలిపారు. కాగా, శ్రీలంకకు పంపే విమానాలకు ఎయిర్ క్లియరెన్స్ ఇవ్వకుండా 60 గంటల పాటు ఆపేసిందని పాకిస్థాన్ విదేశాంగ శాఖ ఆరోపించింది. సహాయార్థం గడువు తీరిన పదార్థాలు పంపిన పాక్‌మరోవైపు దిత్వా తుపాను ప్రభావంతో కష్టాల్లో ఉన్న శ్రీలంకకు సహాయంగా గడువు తీరిన పదార్థాలు పంపి పాకిస్థాన్ నవ్వుల పాలయింది. కొలంబోకు పంపించే ప్యాకేజీలకు సంబంధించిన



ఫోటోలను పాక్ హైకమిషన్ స్వయంగా సోషల్ మీడియాలో పంచుకుంది. ఆ చిత్రాలను పరిశీలించగా ప్యాకెజీలపై 10 వ తేదీ 2024తో వాటి గడువు ముగిసినట్టు లేబుల్ కనిపించింది. వీటికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గడువు తీరిన పదార్థాలను సహాయార్థం ఇచ్చినందుకు సోషల్ మీడియాలో పాక్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ చర్యల ద్వారా శ్రీలంకను పాక్ అవమానపరిచిందని నెటిజన్లు మండిపడ్డారు. శ్రీలంక అధికారులు కూడా ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యవహారంపై ఇప్పటివరకూ పాకిస్థాన్ స్పందించలేదు.శ్రీలంకలో 465కు చేరిన తుపాను మృతుల సంఖ్యమరోవైపు శ్రీలంకలో దిత్వా తుపాను మృతుల సంఖ్య 465కు చేరింది. ఈ విపత్తులు, వరదల ధాటికి మరో 366 మంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. రాబోయే రోజుల్లో అనేక ప్రాంతాల్లో భారీ వర్షం పడే అవకాశం ఉందని సూచించారు. సుమారు 3లక్షల మంది చిన్నారులపై ఈ తుపాను తీవ్ర ప్రభావం చూపినట్లు యునిసెఫ్ అంచనా వేసింది. తుపాను కారణంగా వరదలతో శ్రీలంకలో అల్లకల్లోలం కాగా, పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి భారీ నష్టం వాటిల్లింది. సహాయ, పునరుద్ధరణ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే అనేక దేశాలు శ్రీలంకకు మానవతా సహాయం, సరకులు పంపుతున్నాయి. భారత్ సైతం శ్రీలంకకు మానవతా సహాయం కోసం ఆపరేషన్ సాగర్ బంధు చేపట్టింది. వాయు, సముద్రం మార్గంలో 53 టన్నుల సరకులు పంపింది భారత్. అత్యవసర సమయాల్లో భారత్ ప్రముఖ పాత్ర పోషించిందని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే కార్యాలయం ప్రకటించింది. క్లిష్ట సమయంలో శ్రీలంక ప్రజలకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని మోదీ భరోసా ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా పేర్కొంది.

# విమాన ప్రయాణాల కోసం రోజుకు రూ.21 లక్షలు ఖర్చు చేస్తున్న మధ్యప్రదేశ్ ప్రభుత్వం

**భోపాల్:** విమానాలు, హెలికాప్టర్లలో ప్రయాణం కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తున్నది. విమానయాన బిల్లు రోజుకు రూ.21 లక్షలకు చేరింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపడింది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రతాప్ గ్రేవాల్, పంకజ్ ఉపాధ్యాయ్ లేవనెత్తిన ప్రశ్నలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. 2021 జనవరి నుంచి 2025 నవంబర్ వరకు ప్రైవేట్ విమానాలు, హెలికాప్టర్ల అద్దెల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.290 కోట్లు ఖర్చు చేసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రైవేట్ వైమానిక ఆపరేటర్లకు అత్యధికంగా రూ. 90.7 కోట్లు చెల్లించింది.కాగా, జనవరి 2024 నుంచి నవంబర్ 2025 వరకు ప్రైవేట్ విమానాలు, హెలికాప్టర్ల అద్దెల కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వం రూ.143 కోట్లు ఖర్చు చేసింది. సుమారు 23 నెలల్లో నెలకు దాదాపు రూ. 6.2 కోట్లు లేదా రోజుకు సగటున రూ. 20-21 లక్షలు వ్యయం చేసింది. దీనికి ముందు మూడు ఏళ్లల్లో 2021 జనవరి నుంచి 2023 డిసెంబర్ వరకు ప్రభుత్వం రూ.147 కోట్లు ఖర్చు చేసింది. అంటే నెలకు దాదాపు రూ. 4.1 కోట్లు లేదా రోజుకు సగటున రూ.13 నుంచి రూ.14 లక్షలు వ్యయమైంది.మరోవైపు 2019లో మధ్యప్రదేశ్ రాష్ట్ర



విమానాల అద్దె వ్యయం ఏటా రూ.1.63 కోట్లు ఉన్నది. అయితే 2025 నాటికి అది రూ.90.7 కోట్లకుపైగా పెరిగిందని సీఎం మోహన్ యాదవ్ అంగీకరించారు. కోవిడ్ తర్వాత పర్యాటకంతోపాటు విమానాల డిమాండ్ పెరుగడం, లోక్‌సభ ఎన్నికలు, ఇంధనంతోపాటు నిర్వహణ ఖర్చులు తీవ్రంగా పెరుగడం వంటి కారణాల వల్ల అద్దె రేట్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. దీంతో ప్రైవేట్ విమానం, హెలికాప్టర్ ఛార్జీలు 20-30 శాతం పెరిగాయి. 2022-23లో గంటకు రూ.4.45 లక్షలుగా ఉన్న ధరలు 2024లో రూ.5.70 లక్షలకు పెరిగాయి. కొన్ని సంస్థల హెలికాప్టర్ ధరలు గంటకు రూ.5.29 లక్షలకు చేరుకున్నాయి.2021 మేలో కూలిపోయిన ఆ రాష్ట్ర ప్రభుత్వ విమానం గ్వాలియర్ ఎయిర్‌బేస్‌లో నిలిచిపోయింది. నాలుగేళ్లుగా మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ప్రైవేట్ విమానయాన సం స్థలపై ఎక్కువగా ఆధారపడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. దీని ఫలితంగా ఖర్చులు పెరుగుతున్నాయని వెల్లడించింది. అయితే గ్రౌండ్ చేసిన ప్రభుత్వ విమానాలకు నాలుగేళ్లుగా ప్రభుత్వం ఎం దుకు మరమ్మతులు చేపట్టలేదని ప్రతిపక్ష కాంగ్రెస్ ప్రశ్నించింది. గత 20 ఏళ్లలో రాష్ట్ర అప్పు 16 రెట్లు పెరిగి రూ. 20,000 కోట్ల నుంచి రూ. 4.64 లక్షల కోట్లకు పెరుగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు ఏటా రూ. 27,000 కోట్లు వడ్డీకే చెల్లిస్తుండటంపై అసెంబ్లీలో మండిపడింది.

# సంచార్ సాథీతో సైబర్ ఫ్రాడ్‌ల నుంచి రక్షణ

**న్యూఢిల్లీ:** సైబర్ మోసాల బారిన పడకుండా నిరోధించే ఏకైక మార్గం 'సంచార్ సాథీ' అప్లికేషన్ అని అని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారంనాడు తెలిపారు. భారత్‌లో విక్రయించే ఫోన్లలో ఈ యాప్‌ను ముందుగానే ఇన్‌స్టాల్ చేసి ఇవ్వాలనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలపై విపక్షాలు ఆందోళన వ్యక్తం చేయడం, ఇది ప్రజల వ్యక్తిగత జీవితాలపై నిఘా పెట్టడమే అవుతుందని అభ్యంతరాలు చెబు తున్న నేపథ్యంలో మంత్రి తాజా వివరణ ఇచ్చారు. 'స్నూపింగ్ యాప్ అని చెబుతున్న ఎవరికైనా ఒక మాట చెప్పదలచుకున్నాను. దయచేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి. మీఅంతగా మీరు క్షుణ్ణంగా పరిశీలించండి. సైబర్ నేరాలను నిరోధించేందుకు చాలా తక్కువ మార్గాలు ఉన్నారు. నా అభిప్రాయంలో సైబర్ నేరాలను నిరోధించేందుకు ఇదొక్కటే మార్గం. యాప్‌ను ప్రీ-



ఇన్‌స్టాల్ చేయడం తప్పనిసరా కాదా అనేది వేరే విషయం. తమ ఆదేశాలను పునఃపరిశీలిస్తామని ప్రభుత్వం, సింధియా వివరణ ఇచ్చారు. విద్యాధికుల సమాచారం సేకరించడం, దానిని పేదలు, వృద్ధులకు సాయపడేందుకు ఉపయోగించడం ఈ యాప్ లక్ష్యం' అని చంద్రశేఖర్ చెప్పారు.20 కోట్ల వెబ్‌సైట్ హిట్లుఅన్ని వాడుకభాషల్లోనూ యాప్ పనిచేస్తుందని మంత్రి తెలిపారు. సంచార్ సాథీ వెబ్‌సైట్‌ను ఒకసారి చూసినట్టయితే ఈ వెబ్‌సైట్‌కు 20 కోట్ల వెబ్‌సైట్ హిట్లు వచ్చాయని, 1.4 కోట్ల మంది ఇప్పటికే ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు. యాప్ స్టోర్‌లో కనిపించడానికి ముదు యాపిల్, గూగుల్ సైత యాప్‌ను వెరిఫై చేసినట్టు తెలిపారు. ఎవరైనా యాప్ వద్దనుకుంటే దాన్ని డిలీట్ చేయవచ్చని, అయితే యాప్ ఆలోచన మంచిదని, ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని మంత్రి సూచించారు

# విపక్షాల నిరసనలతో- సంచార్ సాథీ యాప్ పై వెనక్కి తగ్గిన కేంద్రం

సంచార్ సాథీ యాప్ ప్రీ ఇన్‌స్టాలేషన్‌పై కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గింది. మొబైల్ ఫోన్లలో దీనిని ముందుగానే ఇన్?స్టాల్? చేయడం తప్పనిసారి కాదని స్పష్టం చేసింది. ఈ యాప్? వల్ల వ్యక్తిగత సమాచార గోప్యతకు భంగం ఏర్పడుతుందంటూ విపక్షాలు తీవ్ర నిరసన చేపట్టిన నేపథ్యంలో కేంద్రం వెనక్కుతగ్గక తప్పలేదు.ఇంతకు ముందు సంచార్ సాథి యాప్‌తో నిఘా పెట్టేందుకు అవకాశమే లేదని కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. కొత్త డివైజ్‌లలో సంచార్ సాథి యాప్‌ను ప్రీ-ఇన్‌స్టాల్ చేయాలని కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ స్మార్ట్ ఫోన్ తయారుదారులను కోరటంపై దుమారం రేగడంతో కేంద్ర మంత్రి లోక్?సభలో ఈ వివరణ ఇచ్చారు. అది ప్రజల రక్షణకు సంబంధించి యాప్ అని, ఆ యాప్‌తో నిఘా పెట్టడం సాధ్యం కాదని లోక్‌సభ ప్రశ్నోత్తరాల




కార్యక్రమంలో మంత్రి సింధియా సమాధానం ఇచ్చారు. తమను తాము కాపాడుకునే శక్తి ప్రజలకు ఇవ్వాలని ప్రభుత్వం కోరుకుంటున్నట్లు చెప్పారు.సంచార్ సాథి యాప్‌ను తప్పనిసరిగా కొత్త మొబైల్ ఫోన్లలో ప్రీ-ఇన్‌స్టాల్ చేయాలని, పాతవాటిలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయాలని మొబైల్ ఫోన్ తయారీదారులను ఆదేశిస్తూ నవంబర్ 28న కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాదు యాప్? ఫంక్షన్స్? ఆపడానికి, రిస్ట్రిక్ట్ చేయడానికి వీలు లేకుండా చేయాలని ఆదేశించింది. ఫోన్ల తయారీదారులతోపాటు, దిగుమతిదారులు కూడా ఈ నిబంధనను పాటించాలని స్పష్టం చేసింది. కేవలం 90 రోజుల్లోగా దీనిని అమలు చేయాలని పేర్కొంది.మొబైల్? ఫోన్లలో సంచార్? సాథీ యాప్?ను తప్పనిసరి చేయడంపై విపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇది ప్రజల వ్యక్తిగత జీవితాలపై నిఘా ఉంచడానికి చేస్తున్న ప్రయత్నమని విమర్శించాయి. ముఖ్యంగా కాంగ్రెస్?, ఆమ్? ఆద్మీ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించాయి. మోదీ సర్కార్? తీరును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. ప్రభుత్వం ప్రజల గొంతు నులిమే ప్రయత్నం చేస్తోందని అన్నారు.

# అతను భారత్‌తో యుద్ధం కోరుకుంటున్నాడు

**పాకిస్థాన్ :** మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సోదరి అయిన అలీమా ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ భారత్‌తో యుద్ధం కోరుకుంటున్నాడని, యుద్ధం కోసం తహతహలాడుతున్నాడని అన్నారు. తన సోదరుడు ఇమ్రాన్ మాత్రం పొరుగుదేశంతో స్నేహపూర్వక సంబంధాల కోసం ప్రయత్నాలు చేశాడని చెప్పారు.ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అలీమా ఖాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. మునీర్‌ను ఇస్లామిక్ ఛాందసవాదిగా అభివర్ణించారు. ఇమ్రాన్ స్వేచ్ఛావాది అని చెప్పారు. ఈ సందర్భంగా మే నెలలో భారత్-పాక్ మధ్య యుద్ధానికిగల కారణం గురించి ప్రశ్నించగా.. ఆమె మునీర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సందర్భం వచ్చినప్పుడల్లా



మునీర్ భారత్‌తో ఘర్షణలకు దిగుతాడని, ఇది భారత్‌తోపాటు దాని మిత్ర దేశాలకు కూడా నష్టమేనని అన్నారు.పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైల్లోనే మృతిచెందారని పెద్దఎత్తున ప్రచా రం జరిగిన నేపథ్యంలో ఆయన మరో సోదరి ఉజ్మా ఖానుమ్ ఇమ్రాన్‌ను మంగళవారం కలిశారు. సమావేశం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇమ్రాన్ జైల్లో సురక్షితంగానే ఉన్నారని, అయితే ఆయనను మానసికంగా వేధిస్తున్నట్లు చెప్పారని ఆరోపించారు. తాను జైలు శిక్ష అనుభవించడానికి ఆసిమ్ మునీర్ కారణమని ఇమ్రాన్ తనతో చెప్పాడని తెలిపారు.

# గైక్వాడ్, కోహ్లీ సెంచరీలు






కింగ్ విరాట్ కోహ్లీ (102) మరోసారి తన విశ్వరూపం ప్రదర్శించాడు. వరుసగా రెండో సెంచరీ సాధించాడు. యువ ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్ (105) కూడా తొలి శతకంతో మెరిశాడు. ఈ ఇద్దరు ఆటగాళ్లు చెలరేగడంతో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో వన్డేలో టీమిండియా భారీ స్కోరు సాధించింది. రాయ్‌పూర్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు టీమిండియా బ్యాటర్లు చుక్కలు చూపించారు రాంచీలో జరిగిన తొలి వన్డేలో సెంచరీ చేసిన కింగ్ కోహ్లీ తన ఫామ్‌ను కొనసాగించి ఈ రోజు మరో సెంచరీ చేశాడు. 90 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో శతకం బాదాడు. కోహ్లీ కెరీర్‌లో ఇది 53వ వన్డే సెంచరీ. మరో ఎండ్‌లో గైక్వాడ్ (105) కూడా అద్భుత శతకం సాధించాడు. గైక్వాడ్ 77 బంతుల్లోనే సెంచరీ చేశాడు. 2 సిక్స్‌లు, 12 ఫోర్లు కొట్టాడు. కెరీర్‌లో తొలి సెంచరీ చేశాడు (అనంతరం యన్‌సెన్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. కోహ్లీ, గైక్వాడ్ మూడో వికెట్‌కు 195 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు.కోహ్లీ, గైక్వాడ్ అవుటైన తర్వాత టీమిండియా పరుగుల వేగం తగ్గిందికెప్టెన్ కేఎల్ రాహుల్ (66 నాటౌట్) మరో హాఫ్ సెంచరీ సాధించినప్పటికీ అనుకున్నంత భారీ స్కోరు రాలేదు. సుందర్ ఒక్క పరుగుకే అవుటయ్యాడు. జడేజా వేగంగా పరుగులు చేయలేకపోయాడు. దీంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 358 పరుగులు చేసింది. రుతురాజ్-విరాట్ జోడీ మూడో వికెట్‌కు అజేయంగా 156 బంతుల్లో 195 పరుగులు చేశాడు. ఇక చివరలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ కేఎల్ రాహుల్ సైతం ధాటిగా బ్యాటింగ్ చేశాడు. దాంతో టీమిండియా భారీ స్కోర్‌ను చేయగలిగింది. కేఎల్ రాహుల్ 43 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో 66 పరుగులతో అజేయంగా నిలిచాడు. కేఎల్ రాహుల్‌కు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (24) సహకారం అందించాడు. దాంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 358 పరుగుల భారీ స్కోర్ చేయగలిగింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్‌కు రెండు, బర్గర్, ఎన్గిడికి చెరో వికెట్ దక్కింది. ఇక వన్డేల్లో దక్షిణాఫ్రికాపై భారత్‌కు ఇది రెండో భారీ స్కోర్. 2010లో గ్వాలియర్ వన్డేలో మూడు వికెట్ల నష్టానికి 401 పరుగులు చేసింది.మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా వన్డేలో టీమిండియా విజయం సాధించి 1-0 ఆధిక్యంలో ఉంది. ఈ రోజు మ్యాచ్‌లో కూడా గెలిస్తే ఈ సిరీస్‌ను టీమిండియా దక్కించుకుంటుంది

# బీవోఎం షేర్లకు భలే గిరాకీ




ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీవోఎం) షేర్లకు మదుపరుల నుంచి విశేష స్పందన లభించింది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో భాగంగా మంగళవారం ఉదయం నాన్-రిటైల్ ఇన్వెస్టర్ల కోసం ఒక్కో షేర్‌ను రూ.54 ధరతో 38,45,77,748 (దాదాపు 38.46 కోట్లు) షేర్లను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. అయితే తొలిరోజే ఏకంగా 407 శాతం (4.07 రెట్లు) అధికంగా సబ్‌స్క్రైబ్ అయ్యింది. దీంతో బేస్ ఆఫర్‌కు అదనంగా మరింత వాటాను విక్రయానికి తీసుకురావాలని మోదీ సర్కారు నిర్ణయించింది. ఈ క్రమంలోనే సుమారు మరో 8 కోట్ల షేర్లను సేల్‌కు జత చేశారు. వీటికి బుధవారం రిటైల్ ఇన్వెస్టర్లు బిడ్లను దాఖలు చేయవచ్చు. ఈ మేరకు దీపం కార్యదర్శి అరుణిష్ చావ్లా 'ఎక్స్'లో పేర్కొన్నారు. కాగా, తొలుత అమ్మకానికి పెట్టిన వాటా బ్యాంక్ పెయిడ్ అప్ ఈక్విటీ షేర్ క్యాపిటల్‌లో 5 శాతానికి సమానం.దీనికి మరొక్క శాతం (7,69,15,549) షేర్లు కలిశాయిప్పుడు. దీంతో 6 శాతానికి సమానమైన 46.14 కోట్లకుపైగా షేర్లు ఈ ఓఎఫ్ఎస్ ద్వారా కేంద్రం అమ్మినైట్టైంది. తద్వారా దాదాపు రూ.2,492 కోట్లు ఖజానాకు చేరుతున్నాయి. ఇక సోమవారం బీఎస్ఈ ట్రేడింగ్‌లో బీవోఎం షేర్ రూ.57.66 వద్ద ముగిసింది. అయినప్పటికీ దీనిపై 6.34 శాతం రాయితీతో రూ.54 ఫ్లోర్ ప్రైస్‌కే బ్యాంక్ షేర్‌ను కేంద్రం అమ్మకానికి పెట్టింది. కాగా, పుణె కేంద్రంగా నడుస్తున్న బీవోఎంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రస్తుతం 79.60 శాతం వాటా ఉన్నది. అయితే ఈ విక్రయంతో సర్కారు వాటా 75 శాతం దిగువకు పడిపోతున్నది. తద్వారా క్యాపిటల్ మార్కెట్ రెగ్యులేటర్ సెబీ.. దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన సంస్థల కోసం పెట్టిన మినిమం పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధన 25 శాతాన్ని బీవోఎం అందుకున్నట్టవుతున్నది.

# ఇంట్రాడేలో రూ.90కి డాలర్-రూపీ మారకం




ముంబై: దేశీయ కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక దశలో 47 పైసలు క్షీణించి తొలిసారిగా రూ.90 మైలురాయికి చేరింది. చివరికి 43 పైసల నష్టంతో రూ.89.96 వద్ద ముగిసింది. ఇది ఆల్‌టైమ్ కనిష్ఠ ముగింపు కూడా. అంతర్జాతీయంగా డాలర్ బలపడటం, దిగుమతిదారుల నుంచి అమెరికన్ కరెన్సీకి డిమాండ్ పెరగడం, ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటం, స్పెక్యులేషన్ ట్రేడర్ల షార్ట్ కవరింగ్ మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం జాప్యమవుతుండటం, వాణిజ్య లోటు ఆందోళనలు కూడా ఇందుకు మరో కారణమని వారన్నారు. ఈ ఏడాదిలో రూపాయి విలువ 5 శాతం మేర క్షీణించింది. ఆసియాలోకెల్లా అత్యధికంగా నష్టపోయిన కరెన్సీ మనదే.ముమ్ముందు మరింత క్షీణత"డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటుకు రూ.90 ప్రధాన నిరోధక స్థాయిగా ఉండనుంది. ఒకవేళ ఈ స్థాయిని కూడా అధిగమిస్తే, ఎక్స్ఛేంజ్ రేటు రూ.91 లేదా ఆపై దిశగా పయనించవచ్చు"ని కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ విభాగ అధిపతి అనింద్య బెనర్జీ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత తరుణంలో రూపాయిని ఆదుకునేందుకు ఫారెక్స్ కార్యకలపాల్లో ఆర్‌బీఐ జోక్యం చేసుకోవాలని, లేదంటే కరెన్సీ విలువ మరింత పతనం కావచ్చని, అది మారకం విలువలో తీవ్ర హెచ్చుతగ్గులకు కూడా దారితీయవచ్చని ఆయన పేర్కొన్నారు. కాగా, ఫెడ్ రేట్ల తగ్గింపు అవకాశాలు, ఆర్‌బీఐ జోక్యంతో రూపాయికి మద్దతు లభించవచ్చని, ముమ్ముందు సెషన్లలో డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.89.60-90.20 శ్రేణిలో కదలాడవచ్చని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అన్నారు.78 ఏళ్ల స్వతంత్ర భారతంలో రూ.3.30 నుంచి రూ.90 వరకు..భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన ఏడాది (1947)లో రూ.3.3గా ఉన్న డాలర్-రూపాయి మారకం విలువ.. 1990 దశకం వరకు చాలా నెమ్మదిగానే తగ్గుతూ వచ్చింది. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు హయాంలో (1991) తొలి తరం ఆర్థిక సంస్కరణలు చేపట్టినప్పటి నుంచి రూపాయి విలువ వేగంగా కరుగుతూ వచ్చింది. నరేంద్ర మోదీ తొలిసారి అధికారంలోకి వచ్చిన 2014లో రూ.62 స్థాయిలో ఉన్న రూపా యి మారకం విలువ.. గడిచిన 11 ఏళ్లలో మరింత వేగంగా క్షీణిస్తూ వచ్చింది. ఏటేటా పెరుగుతూ వస్తున్న వాణిజ్య లోటు, ముడి చమురు, పసిడి సహా పలు దిగుమతులపై ఆధారం పెరగడం, అధిక ధరలు వంటి అంశాలు ఇందుకు కారణమయ్యాయి.

# 3 నెలల తర్వాత రీఎంట్రీ



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా జట్టు తరపున బరిలోకి దిగిన హార్దిక్ పాండ్యా, పంజాబ్ జట్టుపై తన ప్రతాపం చూపించాడు. కేవలం 42 బంతుల్లోనే అజేయంగా 77 పరుగులు (నాటౌట్) సాధించాడు. ఇందులో 7 ఫోర్లు, 4 భారీ సిక్సర్లు ఉన్నాయి. హార్దిక్ మెరుపు ఇన్నింగ్స్ కారణంగా బరోడా జట్టు 223 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 5 బంతులు మిగిలి ఉండగానే ఛేదించి 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా మైదానంలోకి అడుగుపెట్టడమే ఆలస్యం.. తనదైన శైలిలో రికార్డుల మోత మోగించాడు. గాయం కారణంగా కొంతకాలం ఆటకు దూరంగా ఉన్న హార్దిక్, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ద్వారా రీఎంట్రీ ఇచ్చి బ్యాటింగ్‌లో విధ్వంసం సృష్టించాడు. ఈ క్రమంలో టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని పేరిట ఉన్న ఒక అరుదైన రికార్డులో హార్దిక్ చోటు సంపాదించాడు.రికార్డు వివరాలు.టి20 క్రికెట్ చరిత్రలో 'సెంచరీ లేకుండానే 300కు పైగా సిక్సర్లు' బాదిన భారతీయ క్రికెటర్ల జాబితాలో హార్దిక్ పాండ్యా చేరాడు. ఇప్పటివరకు ఈ ఘనత సాధించిన ఏకైక భారతీయ క్రికెటర్ ఎంఎస్ ధోని మాత్రమే. ఇప్పుడు హార్దిక్ పాండ్యా ఆ జాబితాలో చేరిన రెండో భారతీయుడిగా రికార్డు సృష్టించాడుఎంఎస్ ధోని: ఇప్పటివరకు టీ20లలో 300కు పైగా సిక్సర్లు కొట్టిన ధోని అత్యధిక వ్యక్తిగత స్కోరు 84 పరుగులు మాత్రమే (సెంచరీ లేదు).రాంచీలో చెత్త ఆట.. కట్‌చేస్తే.. 2వ వన్డే నుంచి ముగ్గురు ఔ12 బంతుల్లో హాఫ్ సెంచరీ.. 32 బంతుల్లో సెంచరీ.. అభిషేక్ బీభత్సంం హార్దిక్ పాండ్యా: తాజాగా బరోడా తరపున పంజాబ్‌పై ఆడిన ఇన్నింగ్స్‌లో 4 సిక్సర్లు బాదడం ద్వారా హార్దిక్ తన టి20 కెరీర్‌లో 300 సిక్సర్ల మైలురాయిని దాటాడు. హార్దిక్ టీ20 అత్యధిక స్కోరు కూడా సెంచరీ కంటే తక్కువే కావడం విశేషం.హార్దిక్ రీఎంట్రీ ఇన్నింగ్స్.సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా జట్టు తరపున బరిలోకి దిగిన హార్దిక్ పాండ్యా, పంజాబ్ జట్టుపై తన ప్రతాపం చూపించాడు. కేవలం 42 బంతుల్లోనే అజేయంగా 77 పరుగులు (నాటౌట్) సాధించాడు. ఇందులో 7 ఫోర్లు, 4 భారీ సిక్సర్లు ఉన్నాయి. హార్దిక్ మెరుపు ఇన్నింగ్స్ కారణంగా బరోడా జట్టు 223 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 5 బంతులు మిగిలి ఉండగానే ఛేదించి 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. దక్షిణా ఫ్రికాతో జరగబోయే టీ20 సిరీస్‌కు ముందు హార్దిక్ పాండ్యా ఇలాంటి ఫామ్‌లో ఉండటం భారత జట్టుకు శుభపరిణామం. బౌలింగ్‌లో కాస్త తడబడిన పటికీ, బ్యాటింగ్‌లో ఫినిషర్‌గా తన సత్తాను మరోసారి చాటాడు.

# రూపాయి రికార్డు పతనం సూచీలకు భారీ నష్టాలు




విదేశీ మదుపర్లు రూ.1, 171 కోట్ల విలువైన షేర్లను అమ్మేయడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తమయ్యారు. అలాగే ఆర్బీఐ వడ్డీ రేట్ల కోత ఇప్పట్లో ఉండదనే అంచనాలు, అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం సూచీలను వెనక్కి లాగాయి.డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ (రూ.90) రికార్డు కనిష్టానికి పడిపోవడం మదుపర్లను కలవరపెట్టింది. దీంతో సూచీలకు వరుసగా రెండో రోజు కూడా నష్టాలు తప్పలేదు. రోజంతా సూచీలు నష్టాల బాటలోనే సాగాయి. సోమవారం విదేశీ మదుపర్లు రూ.1, 171 కోట్ల విలువైన షేర్లను అమ్మేయడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తమయ్యారు. అలాగే ఆర్బీఐ వడ్డీ రేట్ల కోత ఇప్పట్లో ఉండదనే అంచనాలు, అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం సూచీలను వెనక్కి లాగాయి. దీంతో ఈ రోజు సెన్సెక్స్, నిఫ్టీ నష్టాలతో రోజును ముగించాయి. .గత సెషన్ ముగింపు (85, 6416)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం దాదాపు 300 పాం యింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే కదలాడింది. మధ్యాహ్నం తర్వాత ఆ నష్టాలు మరింత పెరిగాయి. నెగిటివ్ వార్తల కారణంగా చివర్లో అమ్మకాలు పెరగడంతో సెన్సెక్స్ భారీగా ంది. చివరకు సెన్సెక్స్ 503 పాయింట్ల నష్టంతో 85, 138 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 143 పాయింట్ల నష్టంతో 26, 032 వద్ద స్థిరపడింది .ఆసియన్ పెయింట్స్, హిటాచీ ఎనర్జీ, మదర్సన్, వోడాఫోన్ ఐడియా, గ్లెన్‌మార్క్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి ఇండియన్ బ్యాంక్, నవుమా హెల్త్‌కేర్, ఎన్‌బీసీసీ, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, అదానీ ఎనర్జీ మొదలైన షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 132 పాయింట్లు నష్టపోయింది. బ్యాంక్ నిఫ్టీ 407 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 89.87గా ఉంది.

# యువ ఆటగాళ్లు కాదు రో-కోనే దిక్కు: మహ్మద్ కైఫ్




రాయ్‌పూర్ వేదికగా టీమిండియా-సౌతాఫ్రికా మధ్య రెండో వన్డే మరికొన్ని గంటల్లో ప్రారంభం కానుంది. తొలి వన్డేలో రో-కో అద్భుత ప్రదర్శనతో 17 పరుగుల తేడాతో విజయం సాధించిన భారత్.. ఈ మ్యాచ్‌తో సిరీస్ పట్టేయాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ కీలక వ్యాఖ్యలు చేశాడు.'విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ పరుగు లు చేయకుండా పెవిలియన్ చేరితే మ్యాచ్ కచ్చితంగా ఓడిపోయేది. భారత జట్టు 300కి పైగా పరుగులు చేయలేకపోతే.. సౌతాఫ్రికా విజ యం సాధించి ఉండేది అనే దాంట్లో సందేహమే లేదు. టీమిండియా గెలవాలంటే.. రో-కో రాణించాలన్న విషయం స్పష్టమైంది. ఇప్పుడంతా యువ క్రికెటర్లపై చర్చ జరుగుతోంది. జట్టులో వారికి పెద్ద సంఖ్యలో చోటు కల్పిస్తున్నారు. కానీ వారంతా కలిసి 200 పరుగులు కూడా చేయలేకపోతున్నారు. చివరికి టీమిండియాకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీనే దిక్కయ్యారు' అని కైఫ్ విశ్లేషించాడు.సంబంధం ఉందివిరాట్ సెం చరీకి, టీమిండియా విజయానికి సంబంధం ఉంది. అతడు ఏడు సిక్స్‌లు బాదితే, రోహిత్ మూడు సిక్సులు కొట్టాడు. వారు సిడ్నీలో చేసినట్లుగానే రాంచీలోనూ భాగస్వామ్యం నెలకొల్పారు. ప్రస్తుతం టీమిండియా పరిస్థితి బాగాలేదు. సౌతాఫ్రికా చేతిలో టెస్ట్ సిరీస్ ఓటమి తర్వాత, రాంచీ వన్డేలో విజయం ఊరట కలిగించేదే. ప్రస్తుతం కోహ్లీకి 37, రోహిత్‌కు 38 ఏళ్లు. వారు పరుగులు చేయకుండా ఉండి ఉంటే.. సౌతాఫ్రికా సునాయసంగా రాంచీ వన్డేలో గెలిచి ఉండేది' అని కైఫ్ వివరించాడు.

TGTEL/25/A3750 ... నిజమే ... నిజాయితి
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక


# తెలుగు అర్థంకాదని నా గురించి చాలా సార్లు తప్పుగా మాట్లాడారు



జబర్దస్త్ షో ద్వారా పాపులర్ అయిన వారిలో సుడిగాలి సుదీర్ ఒకరు. కమెడియన్ గా ఎంతో క్రేజ్ తెచ్చుకున్న సుడిగాలి సుధీర్. ఇప్పుడు హీరోగా సినిమాలు చేస్తున్నాడు. ప్రస్తుతం సుధీర్ నటిస్తున్న సినిమా గోట్. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్రయూనిట్ ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ ప్రెస్ మీట్ కు హీరోయిన్, నీరంతా హాజరయ్యారు. ప్రొడ్యూసర్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ.. "సోషల్ మీడియా ద్వారా టీజర్ రిలీజ్ చేసిన దిల్ రాజు గారికి థాంక్స్. నా రెండు సినిమాలకు మంచి రివ్యూస్ వచ్చాయి. అద్భుతం, టెనెంట్‌ను బాగా ఆదరించారు. రివ్యూల వల్ల సినిమా మేకర్స్‌లో బాధ్యత పెరుగుతుంది. రివ్యూవర్లు మీరు ఇలాగే ఉండండి.. కొన్ని డిస్ట్రబెన్సెస్ వల్ల సినిమాను మధ్యలో కొద్ది రోజులు ఆపి మళ్లీ చేశాం. సెకండాఫ్ కథ సెట్ కాకపోవటం, గతంలో ఉన్న దర్శకుడు ప్రయత్నించిన సెట్ కాలేదు ముందున్న టీమ్ కలిసి వర్క్ చేయలేదు. అందుకే ఆ టీమ్‌ను మార్చి%ౌ% కొత్త వారితో వర్క్ చేశాను కొత్త టీమ చాలా కష్టపడి సినిమాను పూర్తి చేసింది అని చెప్పుకొచ్చాడు నిర్మత.అలాగే కళామతల్లే ఈ సినిమాను పూర్తి చేయించుకుంది. దివ్యభారతి ఈ సినిమాను ఒప్పుకోవటమే పెద్ద విషయం.. డేట్స్ సరిగా వాడకపోయినా%ౌ% ఆమె ఎప్పుడూ ఏమీ అనలేదు.. దివ్యభారతికి జరిగిన ఇబ్బందికి స్టేజ్ మీద సారి చెప్పాడు నిర్మాత. మ్యూజిక్ విషయంలో మణిశర్మ గారు చాలా హెల్ప్ చేశారు. మా పరిస్థితి చూసి ఆయన తక్కువ పేమెంట్ తీసుకున్నారు త్వరలోనే సినిమాను రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం అన్నారు నిర్మత.. హీరోయిన్ దివ్య భారతి మాట్లాడుతూ.. తమిళ్‌లో బ్యాచిలర్ ఎంత మంది డెబ్యూనో తెలుగులో గోట్ కూడా లాంటి మూవీ అవుతుంది అనుకున్నా%ౌ% అందుకే ఓకే చెప్పా.. సుదీర్ గారు మల్టీటాలెంటెడ్ యాక్టర్. ఆయన జర్నీ ఇన్‌స్పైరింగ్, ప్రొడ్యూసర్స్ సినిమాకు సంబంధించి ప్రతీ డిటైలింగ్‌ను జాగ్రత్తగా చూసుకున్నారు అని చెప్పుకొచ్చింది.అలాగే ఆమె మాట్లాడుతూ.. నా సెల్ఫ్ రెస్పెక్ట్ కోసం నేను నిలబడ్డాను.. అందుకే దర్శకుడు ఇబ్బంది పెట్టడం గురించి ట్వీట్ చేశాను. అందులో సుధీర్ గురించి ఎందుకు మాట్లాడాల్సి వచ్చింది అంటే.. ఆయన చేస్తున్న పాన్ వరల్డ్ సినిమా లో నన్ను ఐటమ్ సాంగ్ చేయమని అడిగారు. అప్పటికే ఇష్యూ ఉన్నప్పుడు కావాలని నన్ను మళ్లీ మళ్లీ పోక్ చేయటం నాకు నచ్చలేదు. సినిమా స్టార్టింగ్‌లోనూ కూడా నాకు తెలుగు అర్థం కాదని చాలా సార్లు తప్పుగా మాట్లాడారు. వ్యక్తిగతంగా దర్శకుడు, హీరోతో నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. కామెడీ జానర్ కావటంతో ఫస్ట్ టైమ్ కదా అని ట్రై చేయాలి అన్న ఉద్దేశంతో ఈ సినిమాకు ఓకే చెప్పా.. అప్పటికి దర్శకుడి గురించి, సుధీర్ గురించి ఏం తెలియదు. సెట్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఊరికే కూర్చోబెట్టేవారు. డైరెక్టర్ మైక్‌లో ఒక షాట్ తరువాత ఈ అమ్మాయిని ఎంత అందంగా చూపించాలి అనుకున్న అందంగా కనిపించటం లేదు అన్నారు. దర్శకుడు కాన్ఫిడెన్స్ ఇవ్వకపోతే వర్క్ బాగుండదు కానీ అవన్నీ నేను పట్టించుకోలేదు. వాళ్లు సోషల్ మీడియాలో కామెంట్ చేయటం వల్లే నేను బయటకు రావాల్సి వచ్చింది అని చెప్పుకొచ్చింది దివ్యభారతి.

# సీరియల్‌లో సింపుల్ లుక్స్ బయట మాత్రం బీభత్సం భయ్యా

బుల్లితెర ప్రేక్షకులను విపరీతంగా ఆక్టటుకున్న సీరియల్ గుప్పెడంత మనసు. కార్తీక దీపం తర్వాత ఆ స్థాయిలో టీఆర్పీ సొంతం చేసుకున్న ధారవాహిక ఇదే. ఇందులో రిషి, వసుధార పాత్రలకు స్పెషల్ ఫ్యాన్ బేస్ ఉందన్న సంగతి తెలిసిందే.. 2020లో ప్రారంభమైన ఈ సీరియల్ అతి తక్కువ సమయంలోనే తెలుగు ప్రేక్షకులను మెప్పించి టాప్ స్థానంలో దూసుకుపోయింది.బుల్లితెర ప్రేక్షకులను విపరీతంగా ఆక్టటుకున్న సీరియల్ గుప్పెడంత మనసు. కార్తీక దీపం తర్వాత ఆ స్థాయిలో టీఆర్పీ సొంతం చేసుకున్న ధారవాహిక ఇదే. ఇందులో రిషి, వసుధార పాత్రలకు స్పెషల్ ఫ్యాన్ బేస్ ఉందన్న సంగతి తెలిసిందే.బుల్లితెర ప్రేక్షకులను విపరీతంగా ఆక్టటుకున్న సీరియల్ గుప్పెడంత మనసు. కార్తీక దీపం తర్వాత ఆ స్థాయిలో టీఆర్పీ సొంతం చేసుకున్న ధారవాహిక ఇదే. ఇందులో రిషి, వసుధార పాత్రలకు స్పెషల్ ఫ్యాన్ బేస్ ఉందన్న సంగతి తెలిసిందే.2020లో ప్రారంభమైన ఈ సీరియల్ అతి తక్కువ సమయంలోనే తెలుగు ప్రేక్షకులను మెప్పించి టాప్ స్థానంలో దూసుకుపోయింది. మహేంద్ర, జగతి మేడమ్, దేవయాని పాత్రలకు కూడా అభిమానులు ఉన్నారంటే ఈ సీరియల్ వ చ్చి న రెస్పాన్స్ ఏ స్థాయిలో ఉందో చెప్పక్కర్లే దు.2020లో ప్రారంభమైన ఈ సీరియల్ అతి తక్కువ సమయంలోనే తెలుగు ప్రేక్షకులను మెప్పించి టాప్ స్థానంలో దూసుకుపోయింది. మహేంద్ర, జగతి మేడమ్, దేవయాని పాత్రలకు కూడా అభిమానులు ఉన్నారంటే ఈ సీరియల్ కు వచ్చిన రెస్పాన్స్ ఏ స్థాయిలో ఉందో చెప్పక్కర్లేదు.రిషి పాత్రలో కన్నడ నటుడు ముఖేష్ గౌడ నటించగా. వసుధార పాత్రలో రక్షా గౌడ నటించింది. వీరిద్దరి జోడికి యూత్ ఫాలోయింగ్ ఎక్కువే. అయితే ఇందులో అందం, అమాయకత్వం, తెలివైన అమ్మాయిగా ఇలా అన్ని రకాలుగా తెలుగు ప్రేక్షకులకు తెగ నచ్చేసింది వసూధార.రిషి పాత్రలో కన్నడ నటుడు ముఖేష్ గౌడ నటించగా.. వసుధార పాత్రలో రక్షా గౌడ నటించింది. వీరిద్దరి జోడికి యూత్ ఫాలోయింగ్ ఎక్కువే. అయితే ఇందులో అందం, అమాయకత్వం, తెలివైన అమ్మాయిగా ఇలా అన్ని రకాలుగా తెలుగు ప్రేక్షకులకు తెగ నచ్చేసింది వసూధార.ఇటీవలే ఈ సీరియల్ కు శుభం కార్డ్ పడిన సంగతి తెలిసిందే. వసుధార పాత్రతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన రక్షా గౌడ.. ఆ సీరియల్లో పంజాబీ డ్రెస్సులు, చీరకట్టులో ఎంతో పద్ధతిగా కనిపించింది.ఇటీవలే ఈ సీరియల్ కు శుభం కార్డ్ పడిన సంగతి తెలిసిందే. వసుధార పాత్రతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన రక్షా గౌడ.. ఆ సీరియల్లో పంజాబీ డ్రెస్సులు, చీరకట్టులో ఎంతో పద్ధతిగా కనిపించింది.కానీ సోషల్ మీడియాలో ఈ అమ్మడు చాలా డిఫరెంట్. మోడ్రన్ డ్రెస్సులలో గ్లామర్ షో నెట్టింట ఫాలోవర్లను కట్టిపడేస్తుంది. తాజాగా వసుధార క్రేజీ ఫోటోస్ ఇన్ స్టాలో వైరలవుతున్నాయి.కానీ సోషల్ మీడియాలో ఈ అమ్మడు చాలా డిఫరెంట్. మోడ్రన్ డ్రెస్సులలో గ్లామర్ షో నెట్టింట ఫాలోవర్లను కట్టిపడేస్తుంది. తాజాగా వసుధార క్రేజీ ఫోటోస్ ఇన్ స్టాలో వైరలవుతున్నాయి.



# ఓటింగ్‌లో తుక్కురేగ్గొడుతోన్న తనూజ



బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 దాదాపు తుది దశకు చేరుకుంది. సెప్టెంబర్ 07న అట్టహాసంగా ప్రారంభమైన ఈ రియాల్టీ షో ఇప్పటికే 13 వారానికి చేరుకుంది. అంటే మరో రెండు వారాల్లో ఈ షోకు ఎండ్ కార్డ్ పడనుంది. దీంతో ఈసారి టాప్– 5 కంటెస్టెంట్స్ ఎవరు? గ్రాండ్ ఫినాలేకి ఎవరెవరు వెళతారు? బిగ్ బాస్ కప్పు ఎవరు కొడతారన్న దానిపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం బిగ్ బాస్ హౌస్ లో 8 మంది కంటెస్టెంట్స్ ఉన్నారు. ఈ నేపథ్యంలో టాప్–6 కంటెస్టెంట్ తో గ్రాండ్ ఫినాలే నిర్వహిస్తారా? లేక టాప్–5ను ఎంపిక చేసుకుంటారన్నది కూడా ఆసక్తికరంగా సాగుతోంది. అలాగే ఈ వారం ఎలిమినేట్ ఎవ్వరనేది కూడా క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది. 13వ వారం ఎలిమినేషన్స్ కు సంబంధించి ఆరుగురు కంటెస్టెంట్లు నామినేషన్స్ లో నిలిచారు. తనూజ, భరణి, రీతూ చౌదరీ, డీమాన్ పవన్, సుమన్ శెట్టి, సంజనా ఈ వారం నామినేట్ అయిన వారిలో ఉన్నారు. ఇమ్మాన్యుయెల్, కళ్యాణ్ ఈ వారం సేఫ్‌లో ఉన్నారు. ఇక నామినేషన్‌లో ఉన్న వారికి పడుతున్న ఓటింగ్ ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ఇప్పటివరకు నమోదైన ఓట్ల లెక్కను ఒక్కసారి పరిశీలిస్తే.. తనూజ మళ్లీ అత్యధిక ఓటింగ్ శాతంతో టాప్‌లో దూసుకుపోతుంది. కల్యాణ్ నామినేషన్స్ లో లేకపోవడంతో అతనికి పడాల్సిన ఓట్లు కూడా తనూజకు పోల్ అవుతున్నాయి. కాబట్టి ఇతర కంటెస్టెంట్లకు ఆమె అందనంత ఎత్తులో ఉంది. ఇక తనూజ తర్వాతి స్థానంలో రీతూ చౌదరి ఉంది. తనూజతో పోల్చితే సగం ఓటింగ్ శాతమే ఉన్నా, రెండో స్థానంలో ఉండడం రీతూకు అడ్వాంటేజ్ గా మారింది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే.. టాప్ 3లో సంజనా ఉంది. ముఖ్యంగా గతవారం వీకెండ్ ఎపిసోడ్ సంజానా ఓటింగ్ ను అమాంతం పెంచేసింది నాలుగో స్థానంలో భరణి ఉన్నాడు.

# ది రాజా సాబ్' మూవీ రన్ టైమ్ ఫిక్స్





పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ నటించిన లేటెస్ట్ సినిమా ది రాజా సాబ్. సలార్, కల్కి వంటి బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తర్వాత డార్లింగ్ నటిస్తోన్న ఈ చిత్రం పై భారీ అంచనాలు ఉన్నాయి. మారుతి తెరకెక్కిస్తోన్న ఈ హారర్ థ్రిల్లర్ కామెడీలో ఏకంగా ముగ్గురు హీరోయిన్లు నటిస్తున్నారు. మాళవికా మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ప్రభాస్ తో రొమాన్స్ చేయనున్నారు. అలాగే బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ మరో కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్స్, సాంగ్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. సినిమా షూటింగ్ కూడా పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకొంటోన్న ది రాజా సాబ్ వచ్చే ఏడాది సంక్రాంతికి (2026 జనవరి 9న ) ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ టైమ్ దగ్గర పడుతుండడంతో ది రాజా సాబ్ మూవీ నుంచి మరో క్రేజీ అప్డేట్ వచ్చింది. అదేంటంటే..ఇటీవల కాలంలో ప్రభాస్ నటించిన సినిమాలన్నీ రన్ టైమ్ దాదాపు 3గంటలపైనే ఉన్నాయి . అదే సమయంలో డైరెక్టర్ తీసిన సినిమాలు మాత్రం తక్కువ నిడివితోనే ఉంటాయి. ఈ క్రమంలో ప్రభాస్ సినిమా రన్ టైమ్ ఎంతోనని తెలుసుకునేందుకు చాలా మంది ఎదురుచూస్తున్నారు. తాజాగా దీనిపై ఒక క్లారిటీ వచ్చింది. 'ది రాజా సాబ్'కు సంబంధించి అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. ఈ క్రమంలో భారీ రన్‌టైమ్‌తో ఈ మూవీని విడుదల చేస్తున్నారు. టికెట్ బుకింగ్ ప్రకారం ది రాజా సాబ్ మూవీ రన్‌టైమ్ సుమారు 3 గంటలా 14 నిమిషాలుగా కనిపిస్తోంది. మొత్తానికి ప్రభాస్ గత సినిమల్లాగే ది రాజా సాబ్ కూడా భారీ రన్ టైమ్ తో ఉందన్నమాట.

# ప్రభాస్ కోసం కథ రెడీ చేసి ఎన్టీఆర్‌తో మూవీ



టాలీవుడ్ లో చాలా మంది హీరోలు ఎన్నో సూపర్ హిట్ సినిమాలను మిస్ చేసుకున్నారు. కథ నచ్చక కొంతమంది ఆ సినిమాలను వదులుంటే మరోకొంతమంది అనుకోని కారణాల వల్ల సినిమాలను మిస్ చేసుకున్న వారు కూడా ఉన్నారు. అలాగే దర్శకులు కూడా ఓ హీరో కోసం రాసుకున్న కథతో మరో హీరోతో సినిమాలు చేస్తుంటారు. ఇదిలా ఉంటే ఓ స్టార్ డైరెక్టర్ ప్రభాస్ తో చేయాల్సిన సినిమాను ఎన్టీఆర్ తో చేశానని చెప్పారు. ప్రస్తుతం ప్రభాస్, ఎన్టీఆర్ ఇద్దరూ పాన్ ఇండియా స్టార్స్ గా దూసుకుపోతున్నారు. ఇద్దరికీ విపరీతమైన ఫ్యాన్ బేస్ ఉంది. బాహుబలి దగ్గర నుంచి ప్రభాస్ పాన్ ఇండియా స్టార్ గా రాణిస్తుంటే.. ఆర్ఆర్ఆర్ దగ్గర నుంచి ఎన్టీఆర్ పాన్ ఇండియా హీరోగా దూసుకుపోతున్నారు. అయితే తాజాగా ఓ దర్శకుడు మాట్లాడుతూ.. ప్రభాస్ కోసం రెడీ చేసిన కథతో ఎన్టీఆర్ తో సినిమా చేశాను అని తెలిపాడు. 10ప్లాప్స్ రెండే రెండు హిట్స్.. అందంలో దేవకన్య ఈ వయ్యారి భామ.ఆయన ఎవరో కాదు టాలీవుడ్ స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి. కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన అతనొక్కడే సినిమాతో దర్శకుడిగా పరిచయం అయ్యేడు సురేందర్ రెడ్డి. తొలి సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నాడు ఈ టాలెంటడ్ డైరెక్టర్. సురేందర్ రెడ్డి తన కెరీర్ లో ఎన్నో సూపర్ హిట్స్ చూశారు. అలాగే ఫ్లాప్స్ కూడా చూశారు. ఆయన చివరిగా డైరెక్ట్ చేసిన అఖిల్ ఏజెంట్ సినిమా దారుణంగా నిరాశపరిచింది.అబ్బో.. ఇంత హాట్ బ్యూటీని ఎలా మిస్ అయ్యాం భయ్యా..!! ఈ క్రేజీ భామ గుర్తుందా.?కాగా ఓ ఇంటర్వ్యూలో సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను బయట పెట్టారు. కెరీర్ స్టార్టింగ్ లోనే ప్రభాస్ ను డైరెక్ట్ చేసే అవకాశం వచ్చిందని తెలిపారు. అతనొక్కడే సినిమా తర్వాత నాకు వరుసగా ఆఫర్స్ వచ్చాయి. అప్పుడే ప్రభాస్ తో సినిమా చేద్దాం అని అంతా సిద్ధం చేసుకున్నా.. కథ కూడా రెడీ అయ్యింది. ఇంతలో ఎన్టీఆర్ తో సినిమా చేయాలని ఓ వ్యక్తి నాతో అన్నారు. ఆయన మాట కాదనలేక ప్రభాస్ సినిమాను పక్కన పెట్టి ఎన్టీఆర్ తో చేశా.. పైగా ఎన్టీఆర్ అప్పటికే స్టార్ హీరో చేయకపోతే బాగుండదేమో అని వెళ్లి ఎన్టీఆర్ ను కలిసి కథ చెప్పా.. ఆ తర్వాత ఆ ప్రాజెక్ట్ ఓకే అయ్యింది. ఆ సినిమానే అశోక్. అయితే ప్రభాస్ కోసం రెడీ చేసుకున్న కథ ఇది. ఈ కథలో కొన్ని మార్పులు చేసి తారక్ తో చేశాను అని చెప్పుకొచ్చారు సురేందర్ రెడ్డి.

# గత్తర లేపిన కుర్ర భామ

ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ క్యూట్ చిన్నారి టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ తెలుసా ?. సౌత్ ఇండస్ట్రీలో గ్లామర్ ఇమేజ్ సంపాదించుకున్న ఈ బ్యూటీ ఒక్క సినిమాతోనే సెన్సేషన్ అయ్యింది. బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో అలరించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది.ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ క్యూట్ చిన్నారి టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ తెలుసా ?. సౌత్ ఇండస్ట్రీలో గ్లామర్ ఇమేజ్ సంపాదించుకున్న ఈ బ్యూటీ ఒక్క సినిమాతోనే సెన్సేషన్ అయ్యింది. బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో అలరించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. తనే నేహా శెట్టి.ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ క్యూట్ చిన్నారి టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ తెలుసా ?. సౌత్ ఇండస్ట్రీలో గ్లామర్ ఇమేజ్ సంపాదించుకున్న ఈ బ్యూటీ ఒక్క సినిమాతోనే సెన్సేషన్ అయ్యింది. బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో అలరించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. తనే నేహా శెట్టి.యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ నటించిన డిజే టిల్లు సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. ఈ మూవీతో ఒక్కసారిగా గ్లామర్ క్రేజ్ సంపాదించుకుంది. డీజే టిల్లు తర్వాత నేహాకు తెలుగు ప్రేక్షకుల నుంచి ఓ రేంజ్ క్రేజ్ వచ్చేసింది. దీంతో టాలీవుడ్ ఇండస్ట్రీలో నేహాకు వరుస అవకాశాలు క్యూ కట్టాయి.యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ నటించిన డిజే టిల్లు సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. ఈ మూవీతో ఒక్కసారిగా గ్లామర్ క్రేజ్ సంపాదించుకుంది. డీజే టిల్లు తర్వాత నేహాకు తెలుగు ప్రేక్షకుల నుంచి ఓ రేంజ్ క్రేజ్ వచ్చేసింది. దీంతో టాలీవుడ్ ఇండస్ట్రీలో నేహాకు వరుస అవకాశాలు క్యూ కట్టాయి.మాస్ కా దాస్ విశ్వక్ దాస్ హీరోగా నటించిన గ్యాంగ్ ఆఫ్ గోదావరి చిత్రంలో కనిపించింది. హీరో కార్తికేయ జోడిగా బెదురులంక 2012 చిత్రంలో నటించింది. అయితే అందమెంత ఉన్న ఇప్పటికీ ఈ ముద్దుగుమ్మ స్టార్ డమ్ మాత్రం రాలేదు.మాస్ కా దాస్ విశ్వక్ దాస్ హీరోగా నటించిన గ్యాంగ్ ఆఫ్ గోదావరి చిత్రంలో కనిపించింది. హీరో కార్తికేయ జోడిగా బెదురులంక 2012 చిత్రంలో నటించింది. అయితే అందమెంత ఉన్న ఇప్పటికీ ఈ ముద్దుగుమ్మ స్టార్ డమ్ మాత్రం రాలేదు.ఓవైపు సినిమాలు చేస్తున్న ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. ఇటీవలే మరోసారి టిల్లు స్క్వేర్ చిత్రంలో కనిపించింది. ఆ తర్వాత మరో ప్రాజెక్ట్ అనౌన్స్ చేయలేదు.ఓవైపు సినిమాలు చేస్తున్న ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. ఇటీవలే మరోసారి టిల్లు స్క్వేర్ చిత్రంలో



Publisher, Owner And Editor Boddupally Mallaiah 3-62, Yendabetla, Nagarkurnool, Telangan - 509209,
Printer, Gundur Shyam , Shyam Agencies Telkapally(M), Telangana 509385. Published 2-48/1 Near Hanuman Temple, Telkapally(M) Dist.Nagarkurnool, Telangana 509385.
Ph 9441946907, Email : nijamenijayithi@gmail.com Website : nijamenijayithi.com